


జోడు రమేష్ కుమార్
చీఫ్ బ్యూరో
+91 99592 92159



KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

సంపుటి : 06 సంచిక : 95 పేజీలు : 08, వెల రూ. 5రూ/ సోమవారం- 22 - సెప్టెంబర్- 2025

Ananthapuramu. Vijayawada. Tirupati. Visakhapatnam. tadepalligudem. Guntur. Kurnool. Nellore. Srikakulam. Rajamahendravaram. Kadapa. Ongole. Chittoor. Hyderabad. mahabubnagar.


## మంత్రి లోకేశ్ చొరవ

కూలీ పనులకు వెళ్తున్న విద్యార్థి తిరిగి బడికి



- కేజీబీవీలో సీటు రాలేదని కూలి పనికి వెళ్తున్న విద్యార్థిని జెస్సీ
- సీటు ఇప్పించే బాధ్యత తనదని, నిశ్చింతగా చదువుకోవాలని జెస్సీ చెప్పిన మంత్రి లోకేశ్

అమరావతి : మంత్రి లోకేశ్? ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని మరోసారి నిరూపించారు. తన దృష్టికి వచ్చిన ఎన్నో సమస్యలను ఇప్పటికే లోకేశ్? పరిష్కరించారు. తాజాగా మరో సమస్యను పరిష్కరించి ఓ విద్యార్థినికి అండగా నిలిచారు. పత్తి చేలో మగ్గిపోవడం బాధాకరం : కేజీబీవీలో సీటు రాలేదని పత్తి పొలాల్లో కూలీగా వెళ్తున్న విద్యార్థిని జెస్సీకి విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. మిగతా..2లో

## నారావారిపల్లె ప్రాజెక్టుకు 'స్కోచ్ గోల్డెన్ అవార్డు'..

# సీఎం చంద్రబాబు స్పందన

- సీఎం చంద్రబాబు సొంత ఊరి ప్రాజెక్టుకు జాతీయ పురస్కారం
- హర్షం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- ప్రాజెక్టు కింద 1,600 ఇళ్లకు ఉచితంగా సోలార్ ప్యానెళ్లు
- కేవలం 45 రోజుల్లోనే పనులు పూర్తి చేసిన అధికారులు
- ఢిల్లీలో అవార్డు అందుకున్న తిరుపతి జిల్లా కలెక్టర్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత గ్రామమైన నారావారిపల్లెలో చేపట్టిన 'స్వర్ణ నారావారిపల్లె' ప్రాజెక్టుకు ప్రతిష్ఠాత్మకమైన 'స్కోచ్ గోల్డెన్ అవార్డు' లభించింది. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల సీఎం ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ లో స్పందించారు. "స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టుకు మొదటి సంవత్సరంలోనే స్కోచ్ గోల్డెన్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ అద్భుతమైన విజయం వెనుక ఉన్న బృందాన్ని, ప్రతి ఒక్కరిని, మిగతా..2లో

## జగన్ డిమాండ్‌పై హోంమంత్రి అనిత ఫైర్..

ఎమ్మెల్యేగా హాజరుకావాలంటూ పిలుపు



- జగన్‌కు ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని, పులివెందుల ఎమ్మెల్యేగా అసెంబ్లీకి రావాలని అని పిలుపునిచ్చారు.
- లిక్కర్ స్కామ్‌పై నివేదిక వచ్చాక మాట్లాడతానని హోంమంత్రి అనిత తెలిపారు.

అమరావతి : ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీ కి వస్తానంటూ చిన్నపిల్లాడిలా జగన్ మారాం చేస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. జగన్‌కు ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని, పులివెందుల ఎమ్మెల్యేగా అసెంబ్లీకి రావాలని అని పిలుపునిచ్చారు. వైసీపీ హయాంలో చంద్రబాబుకు అవమానం జరిగితే ఆయన ఒక్కరే వాకౌట్ చేశారన్నారు.

## భారత్-పాక్ యుద్ధం ఆపింది నేనే..

# నాకు నోబెల్ ఇవ్వాలి

- భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానన్న ట్రంప్
- వాణిజ్యం నిలిపివేస్తానని హెచ్చరించడంతోనే వారు ఆగిపోయారని వ్యాఖ్య
- ఈ ఘనతకు తనకు నోబెల్ శాంతి బహుమతి రావాలని డిమాండ్
- ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఏడు యుద్ధాలను ఆపినట్లు వెల్లడి
- ప్రతిదానికీ ఓ నోబెల్ బహుమతి ఇవ్వాలని ఆసక్తికర వ్యాఖ్య



ఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని, ఈ ఘనతకు గానూ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఆయన అన్నారు. వాణిజ్యాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించి ఈ సంక్షోభానికి తెరదించినట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం జరిగిన అమెరికన్ కార్నర్‌స్టోన్ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్స్ డిన్నర్‌లో ట్రంప్ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన హయాంలో ప్రపంచ వేదికపై అమెరికాకు ఎన్నడూ లేనంత గౌరవం లభించిందని ట్రంప్ తెలిపారు. "మేం శాంతి ఒప్పందాలు కుదురుస్తున్నాం, మిగతా..2లో

## కశ్మీర్ సమస్య తేలకుండా భారత్‌తో సత్సంబంధాలు అసాధ్యమన్న షెహబాజ్



- భారత్ సహకరించాల్సింది పోయి యుద్ధ వైఖరి అవలంబిస్తోందని విమర్శ
- కశ్మీర్ అంశాన్ని గాజాలో జరుగుతున్న యుద్ధంతో పోల్చిన పాక్ ప్రధాని
- గత యుద్ధాలతో బిలియన్ల డాలర్లు నష్టపోయామని ఆవేదన

కశ్మీర్ సమస్యకు పరిష్కారం లభించకుండా భారత్‌తో సాధారణ సంబంధాలు సాధ్యమవుతాయని ఎవరైనా అనుకుంటే,

## జీఎస్టీ ఉత్సవ్ ప్రారంభం

# కొత్త చరిత్ర మొదలవుతుంది

### వన్ నేషన్- వన్ ట్యాక్స్‌ను సాకారం చేశాం: ప్రధాని మోదీ

- సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీలో మార్పులు అమల్లోకి రానున్న నేపథ్యంలో జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ,
- ప్రజలను గందరగోళం నుంచి జీఎస్టీ బయటపడేసింది.



ఢిల్లీ : సోమవారం నుంచి జీఎస్టీ ఉత్సవ్ ప్రారంభం కాబోతోందని, కొత్త చరిత్ర మొదలవుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వస్తున్నాయని, ఇవి అన్ని రంగాలకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీలో మార్పులు అమల్లోకి రానున్న నేపథ్యంలో జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ, దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఏపీపై మరో వాన గండం

రేపటిలోగా బంగాళాఖాతంలో అల్పపీడనం!

గురువారం నాటికి తూర్పుమధ్య, ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

వాయుగుండంగా మారే అవకాశం



బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురవనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాతావరణ పరిస్థితులపై విపత్తుల నిర్వహణ సంస్థ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, రాబోయే 24 గంటల్లో ఏర్పడనున్న అల్పపీడనంతో పాటు, గురువారం నాటికి తూర్పు మధ్య, మిగతా..2లో

## తెలంగాణలో 'ఓజీ' టికెట్ ను రూ.1.29 లక్షలకు దక్కించుకున్న అభిమాని

- పవన్ కల్యాణ్ 'ఓజీ' సినిమాపై అభిమానుల్లో భారీ క్రేజ్
- చౌటుప్పల్‌లో బెనిఫిట్ షో టికెట్‌కు వేలం పాట
- లక్షా 29 వేలకు పైగా పలికిన 'ఓజీ' టికెట్
- టికెట్‌ను దక్కించుకున్న లక్కారం గ్రామ అభిమాని
- వేలం డబ్బును జనసేన పార్టీకి విరాళంగా ప్రకటన
- చిత్తూరులోనూ లక్షకు అమ్ముడైన 'ఓజీ' టికెట్



హైదరాబాద్: పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో వస్తున్న 'ఓజీ' చిత్రం విడుదలకు ముందే అభిమానుల్లో అంచనాలను తారాస్థాయికి చేర్చింది. సినిమాపై ఉన్న క్రేజ్‌ను చాటిచెబుతూ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఓ అభిమాని బెనిఫిట్ షో టికెట్‌ను మిగతా..2లో

## హైడ్రా కూల్చివేతల్లో ఉద్రిక్తత..



- గాజులరామారంలో ఆదివారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఈ కూల్చివేతల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంది.
- గాజులరామారం పరిధిలోని ప్రభుత్వ సర్వేనెంబర్ - 307లో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు.

## అమ్మవార్ల గద్దెలను ముట్టుకోవద్దు.. మేడారంపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశం

- మేడారం జాతర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- గిరిజన సంప్రదాయాలకు ఎలాంటి భంగం కలగవద్దని స్పష్టం
- పూజారుల సూచనలతో మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు నిర్ణయం
- ఈ నెల 23న మేడారం సందర్శించి డిజైన్లు ఖరారు చేయనున్న ముఖ్యమంత్రి
- అమ్మవార్ల గద్దెలను యథాతథంగా ఉంచాలని కీలక ఆదేశం
- 2026 జాతర నాటికి ప్రపంచస్థాయి సదుపాయాల కల్పనే లక్ష్యం



వివరాలు 2లో..

హైదరాబాద్: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర అభివృద్ధి పనుల్లో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జాతర అభివృద్ధి కోసం రూపొందించే మాస్టర్ ప్లాన్‌లో గిరిజన సంప్రదాయాలకు ఎలాంటి లోటు రాకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి ప్రణాళికలను ఖరారు చేసే ముందు క్షేత్రస్థాయిలో సమ్మక్క-సారలమ్మ పూజారులతో చర్చించి, వారి సలహాలు, సూచనలు

## రాబోయే 3 గంటల్లో తెలంగాణలో భారీ వర్షాలు..



- రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో 3 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.
- పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

### మొదటి పేజి తరువాయి

## జీఎస్టీ ఉత్సవ్ ప్రారంభం- కొత్త చరిత్ర మొదలవుతుంది

ప్రజలను గందరగోళం నుంచి జీఎస్టీ బయటపడేసింది. వన్ నేషన్- వన్ ట్యాక్స్‌ను సాకారం చేశాం. పన్నుల సంస్కరణలతో వృద్ధిరేటు స్థిరంగా కొనసాగుతోంది. జీఎస్టీ కొత్త సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ మరింత పరుగులు పెడుతుంది. నిత్యావసర వస్తువులపై సున్నా శాతం జీఎస్టీ ఉంటుంది. పేదలు, మధ్య తరగతి ప్రజలు ఉపయోగించే కొన్ని వస్తువులపై 5 శాతం జీఎస్టీ మాత్రేమే ఉంటుంది. మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం తగ్గించేందుకే రూ.12 లక్షల వరకు ఐటీ మినహాయింపు ఇచ్చాం. హెూటల్స్ సేవలపై కూడా జీఎస్టీ తగ్గించాం. కొత్త సంస్కరణలు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఊతమిస్తాయి. ఎంఎస్ఎంఈలకు అత్యధిక ప్రయోజనం చేకూరేలా మార్పులు చేశాం

## ఏపీపై మరో వాన గండం

ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది శుక్రవారం నాటికి మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఈ వాయుగుండం శనివారం నాటికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర మధ్య తీరాన్ని దాటవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రంలో గురు, శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలపై దీని ప్రభావం అధికంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంట నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించింది. అధికార యంత్రాంగం కూడా ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది.

## తెలంగాణలో 'ఓజీ' టికెట్ ను రూ.1.29 లక్షలకు దక్కించుకున్న అభిమాని

ఏకంగా రూ.1,29,999 వెచ్చించి సొంతం చేసుకున్నాడు. ఈ ఘటన పవన్ కల్యాణ్‌పై అభిమానానికి నిలువుటద్దం పడుతోంది. వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 25న 'ఓజీ' సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చౌటుప్పల్‌లోని శ్రీనివాసా థియేటర్‌లో పవన్ అభిమానులు బెనిఫిట్ షో టికెట్‌కు వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 'జబర్దస్త్' ఫేమ్ వినోదిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభిమానులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్న ఈ వేలంపాటలో లక్కారం గ్రామానికి చెందిన ఆముదాల పరమేశ్ అనే అభిమాని అందరినీ ఆశ్చర్యపరుస్తూ రికార్డు స్థాయిలో రూ.1,29,999 పలికి టికెట్‌ను దక్కించుకున్నాడు. ఈ వేలం ద్వారా సేకరించిన మొత్తాన్ని జనసేన పార్టీకి విరాళంగా అందజేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. సినిమా టికెట్ వేలం ద్వారా పార్టీకి నిధులు సమకూర్చడం పట్ల సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో కూడా ఓ అభిమాని 'ఓజీ' టికెట్‌ను లక్ష రూపాయలకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో సినిమాపై ప్రేక్షకుల్లో, ముఖ్యంగా అభిమానుల్లో ఏ స్థాయిలో అంచనాలు నెలకొని ఉన్నాయో స్పష్టమవుతోంది. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టికెట్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

## నారావారిపల్లె ప్రాజెక్టుకు 'స్కోచ్ గోల్డెన్ అవార్డు'.. సీఎం చంద్రబాబు స్పందన

ప్రతి కుటుంబాన్ని నేను అభినందిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కేవలం 45 రోజుల్లోనే 1,600 ఇళ్లకు ఉచితంగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశామని, ఇది కర్బన ఉద్గారాలను తగ్గించి హరిత స్వర్ణాంధ్రకు మార్గం సుగమం చేస్తుందని సీఎం తెలిపారు. శనివారం నాడు ఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సురేంద్ర నాయుడు కలిసి ఈ అవార్డును అందుకున్నారు. ఈ గుర్తింపు రావడం పట్ల జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆనందం వ్యక్తం చేశారు. అధికారులు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం రూ. 20.68 కోట్ల వ్యయంతో 1,600 ఇళ్లకు ఉచితంగా సోలార్ ప్యానెళ్లు బిగించారు. ఇందులో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రూ. 10.19 కోట్లు అందించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ. 10.49 కోట్లు సమకూర్చింది. దీని ద్వారా ఏర్పాటు చేసిన 3,396 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ల వల్ల ఏటా 4.89 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. దీని విలువ సుమారు రూ. 3.79 కోట్లు. ఈ ప్రాజెక్టు ద్వారా 1.92 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. కాగా, చంద్రగిరి నియోజకవర్గంలోని నారావారిపల్లె, రంగంపేట, రామిరెడ్డిపల్లి గ్రామాలను కలిపి సమగ్రంగా అభివృద్ధి చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ ఏడాది జనవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ 'స్వర్ణ నారావారిపల్లె విజన్'ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

## జగన్ డిమాండ్‌పై హెూంమంత్రి అనిత ఫైర్.. ఎమ్మెల్యేగా హాజరుకావాలంటూ పిలుపు

లిక్కర్ స్కామ్‌పై నివేదిక వచ్చాక మాట్లాడతానని హెూంమంత్రి అనిత తెలిపారు.

కపిలతీర్థంలో తొక్కిసలాట.. స్పందించిన టీటీడీ

కాగా 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 11 సీట్లకు పరిమితమైంది. దీంతో సంఖ్యాపరంగా జగన్ పార్టీకి ప్రతిపక్ష హెూదా దక్కలేదు. కానీ ఆ పార్టీ నాయకులు మాత్రం ప్రతిపక్ష హెూదా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్ష ఎందుకు ఇవ్వరంటూ జగన్ సైతం ప్రశ్నించారు. మరోవైపు అసెంబ్లీ సమావేశాలు ఈ నెలాఖరు వరకు కొనసాగనున్నాయి. జగన్ మాత్రం సమావేశాలకు హాజరుకావడంలేదు. దీంతో ఆయనపై విమర్శలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో జగన్‌కు ప్రతిపక్ష హెూదాపై రాష్ట్ర హెూంమంత్రి సైతం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

## భారత్-పాక్ యుద్ధం ఆపింది నేనే.. నాకు నోబెల్ ఇవ్వాలి

యుద్ధాలను ఆపుతున్నాం. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని మేమే ఆపాం" అని ఆయన స్పష్టం చేశారు. దీన్ని ఎలా సాధించారో వివరిస్తూ, "వాణిజ్యంతోనే దీన్ని ఆపాను. ఇరు దేశాల నేతలంటే నాకు గౌరవం ఉంది. కానీ, 'మీరు యుద్ధానికి దిగితే మేం ఎలాంటి వాణిజ్యం చేయబోం' అని నేను వారికి స్పష్టం చేశాను. వారి వద్ద అణ్వాయుధాలు ఉన్నాయి. దాంతో వారు యుద్ధం ఆపేశారు" అని ట్రంప్ వివరించారు. కేవలం భారత్-పాకిస్థాన్ మధ్యే కాకుండా, థాయ్‌లాండ్-కంబోడియా, ఆర్మేనియా-అజర్‌బైజాన్, సెర్బియా-కొసోవో సహా మొత్తం ఏడు యుద్ధాలను తాను ఆపినట్లు ట్రంప్ పేర్కొన్నారు. తాను ఆపిన వాటిలో 60 శాతం వాణిజ్య సంబంధాల ద్వారానే సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపితే నోబెల్ బహుమతి వస్తుందని కొందరు తనతో అన్నారని చెబుతూ, "మరి నేను ఆపిన ఈ ఏడు యుద్ధాల సంగతేంటి? నాకు ప్రతిదానికీ ఒక నోబెల్ బహుమతి రావాలి కదా?" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో తనకు మంచి సంబంధాలున్నాయని, అందుకే రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని పరిష్కరించడం సులభమని తాను భావించానని, ఏదో ఒక విధంగా దాన్ని కూడా పరిష్కరించి తీరతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## హైడ్రా కూల్చివేతల్లో ఉద్రిక్తత.. ఎందుకంటే..

హైదరాబాద్, సెప్టెంబరు 21 : గాజులరామారంలో ఇవాళ(ఆదివారం) హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఈ కూల్చివేతల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గాజులరామారం పరిధిలోని ప్రభుత్వ సర్వే నెంబర్ - 307లో కూల్చివేతలు చేపట్టారు హైడ్రా అధికారులు. గాజులరామారం పరిధిలోని దేవేంద్రనగర్, బాలయ్య నగర్, హబీబ్ నగర్ కాలనీలో కూల్చివేతలు చేపట్టింది హైడ్రా. హబీబ్ నగర్‌లో కూల్చివేతలు చేపట్టిన సిబ్బందిపై ఎదురు దాడికి దిగారు బస్తీ వాసులు. బందోబస్తులో ఉన్న పోలీసులతో పాటు, కూల్చివేతలు చేపట్టిన హైడ్రా జేసీబీలపై రాళ్ల దాడి కురిపించారు బస్తీ వాసులు. రాళ్లదాడిలో పోలీసు అధికారితో పాటు, జేసీబీ అద్దాలు పగిలాయి. వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ దాడికి కారణమైన వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కూల్చివేతలు జరిగే ప్రాంతంలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. కాగా, గాజులరామారంలో ఆదివారం హైడ్రా బిగ్ ఆపరేషన్ చేపట్టింది. సర్వే నెంబర్ -307లో అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేస్తుంది. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కూల్చివేతలను అడ్డుకున్నారు స్థానికులు. స్థానికులకు, హైడ్రా అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న తమ ఇళ్లను కూల్చి వేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవేందర్ నగర్, బాలయ్య బస్తి, పోచమ్మ బస్తీలు వందలాది ఇళ్లను నేలమట్టం చేసింది హైడ్రా. ప్రభుత్వ భూమిని తమ ఆధీనంలోకి తీసుకుంది హైడ్రా.

## అమ్మవార్ల గద్దెలను ముట్టుకోవద్దు.. మేడారంపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశం

తప్పనిసరిగా తీసుకోవాలని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా, ఈ నెల 23న తాను స్వయంగా మేడారం సందర్శిస్తానని, మంత్రులు, అధికారులు, గిరిజన ప్రజాప్రతినిధులతో కలిసి డిజైన్లను ఖరారు చేస్తామని వెల్లడించారు. అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు వెంటనే ఒక టెక్నికల్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కొన్ని కీలక సూచనలు చేశారు. "పూజారులు కోరినట్లుగా ఆలయ ప్రాంగణాన్ని విస్తరించాలి. అయితే, అమ్మవార్ల గద్దెలను (రాతి రూపాలు) మాత్రం యథాతథంగా, ఎలాంటి మార్పులు చేయకుండా ఉంచాలి," అని ఆయన స్పష్టం చేశారు. మేడారంలో నిర్మించే స్వాగత తోరణాలు, ఇతర కట్టడాలన్నీ గిరిజన సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని, ఆలయ పరిసరాల్లో స్థానిక సంప్రదాయ వృక్షాలను నాటాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ప్రభుత్వ సలహాదారు వి. వెంకట నరేందర్ రెడ్డి, ఎంపీ పోరిక బలరామ్ నాయక్, పలువురు అధికారులు పాల్గొన్నారు. 2026 నాటికి మేడారం జాతరను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా, భక్తులకు ఆధునిక సదుపాయాలతో నిర్వహించడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి ప్రణాళికలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

## మంత్రి లోకేశ్ చొరవ - కూలీ పనులకు వెళ్తున్న విద్యార్థి తిరిగి బడికి

### మొదటి పేజి తరువాయి

మంత్రాలయం మండలం బూదూరు గ్రామానికి చెందిన జెస్సీ దీన గాథపై అధికారులతో మాట్లాడారు. చిట్టి తల్లి జెస్సీకి కేజీబీవీలో సీటు వస్తుందని, తను నిశ్చింతగా చదువుకోవాలన్నారు. పరిస్థితులు ఏమైనా కానీ పుస్తకాలు, పెన్ను పట్టాల్సిన చేతులు పత్తి చేలో మగ్గిపోవడం బాధాకరమని చెప్పారు. విద్యకు పిల్లలను దూరం చేయొద్దని తల్లిదండ్రులను వేడుకుంటున్నట్లు తెలిపారు. చిట్టి తల్లీ నిశ్చింతగా చదువుకో : పిల్లలను బడికి పంపితే తల్లికి వందనం వస్తుంది, చక్కనైన యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్సులు, బెల్టు ఇస్తున్నామన్నారు. సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నామని వివరించారు. మనబడిలో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత తమదని హామీ ఇచ్చారు. పిల్లల భద్రత -భవితకు భరోసానిచ్చే బడికి మించిన సురక్షిత ప్రదేశం లేదని స్పష్టం చేశారు. "చిట్టి తల్లీ నిశ్చింతగా చదువుకో, కేజీబీవీలో సీటు ఇప్పించే బాధ్యత నాది" అని మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఏం జరిగిందంటే? : కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం



బూదూరు గ్రామానికి చెందిన మీనిగ కుమార్, సంతోషమ్మలకు ముగ్గురు సంతానం. వీరిది నిరుపేద దళిత కుటుంబం. గ్రామంలో సెంటు పొలం లేదు. వలస వెళ్తేగాని కుటుంబం గడవని పరిస్థితి. ఏదిఏమైనా మొక్కవోని సంకల్పంతో ముగ్గురు పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలని ఆ దంపతులు కలలు కంటున్నారు. పెద్ద కుమారుడు ప్రభాస్ ఏడో తరగతి నందవరం ప్రభుత్వ హాస్టల్లో ఉంటు చదువుతున్నాడు. మూడో కుమార్తె మను గ్రామంలోనే ప్రభుత్వం పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. రెండో కుమార్తె జెస్సీ గతేడాది ఐదో తరగతి పూర్తిచేసింది. గ్రామంలో ఐదో తరగతి వరకే ఉంది. ఆరో తరగతిలో చేర్పించేందుకు చిలకలడోణలో ఉన్న కేజీబీవీలో దరఖాస్తు చేశారు. సీటు రాలేదు. జిల్లా ఉన్నతాధికారులను కలిసినా ప్రయోజనం లేకుండాపోయింది. వేరే ఊర్లో పెట్టి చదివించే స్థోమత ఆ కుటుంబానికి లేకపోవటంతో తమ వెంటే పత్తి పనులకు తీసుకెళ్లారు. తెలంగాణలో నెల రోజులు పత్తి పొలంలో పనులు చేసి వర్షాలు ఉండటంతో రెండు రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నారు. చదువు కోవాలని ఉంది కేజీబీవీలో సీటు ఇప్పిస్తే చదువుకుంటానని జిల్లా అధికారులను ఆ విద్యార్థిని వేడుకుంది. విషయం తెలుసుకున్న మంత్రి లోకేశ్ విద్యార్థినికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బాధితుల కుటుంబాల్లో వెలుగులు : ఇప్పటికే మంత్రి లోకేశ్ ఎంతో మంది విద్యార్థులు, సాధారణ ప్రజలు, ఉద్యోగులు, బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఏజెంట్ల చేతిలో దగాపడ్డ వారిని ఆదుకోవడంలో తనదైన ముద్ర చూపుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది కాలంలోనే ప్రభుత్వ యంత్రాంగం, టీడీపీ-ఎన్నారై విభాగం నేతల సమన్వయంతో ఎంతో మంది బాధితుల కుటుంబాల్లో వెలుగులు నింపారు.

# గద్దల రాజ్యం ప్రైవేట్ లిమిటెడ్!

"నెహ్రూ ఒక ఫ్యూడల్. ఆయనకు బాగా డబ్బులున్నాయి. లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు ఆయన ఏ గేట్ దగ్గరికి వెళ్తే అక్కడికో కారు వచ్చేది. ఆయన అనుసరించిన విధానాల వలన సింగపూర్‌తో మనం పోటీపడలేక పోయాము. సింగపూర్ తొలి ప్రధాని లీ క్వాన్ యూ పోటీదారి ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి అభివృద్ధి చేశారు. నెహ్రూ వల్ల మనం సింగపూర్‌తో పోటీపడలేకపోయాము." ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేసినట్టు ఆయనకు బాకా ఊదే మీడియాలో రిపోర్టయింది. బ్రిటిష్ వలస పాలన సంకెళ్లు తెగగొట్టడానికి మొట్ట మొదటిసారిగా లాహెూర్ కాంగ్రెస్ సభలో 'పూర్ణ స్వరాజ్' శంఖా రావం చేసినవాడు నెహ్రూ. తొలి ప్రధానిగా పంచవర్ష ప్రణాళి కలు వేసి నవభారత సౌధ నిర్మాణానికి ఇటుకలు పేర్చిన వాడాయన. అంతర్జాతీయ వేదికపై రష్యా అమెరికా కూటము లకు దీటుగా ప్రవర్ధ స్వతంత్ర దేశాలను కూడగట్టి 'అలీనోద్య మా'న్ని నిర్మించిన ప్రపంచస్థాయి నేత నెహ్రూ. అటువంటి నెహ్రూ గురించి ఐఏఎస్ శిక్షణ పొందిన వారికి తాను చెప్పేది తప్ప ఇంకేమీ తెలియకపోవచ్చనుకోవడం బాబు ఆత్మవిశ్వాసా నికి ఓ మచ్చుతునక అనుకోవాలి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి అనేక గేట్లుంటాయి. ఆయన ఏ గేటులోంచి బయటికి వస్తారో తెలియదు గనుక ప్రతి గేటు దగ్గరా ఒక కారుండేదని బాబు చెబుతున్నారు. అంత డబ్బున్న వాడు గనుక ఆయన 'ఫ్యూడల్' అంటున్నారు. బాగా డబ్బున్న వాళ్లను 'ఫ్యూడల్స్' అనాలేమో! ఈ థియరీ ప్రకారం బోలెడంత డబ్బున్న ఎలాన్ మస్క్, అంబానీ వంటి వాళ్లంతా పెద్దపెద్ద ఫ్యూడల్స్ అనుకోవాలి. బాబు ప్రేమించే సింగపూర్‌లో పెద్దసంఖ్యలో బిలియనీర్లు, మిలియనీర్లు ఉన్నారు కాబట్టి అక్కడున్నది ఫ్యూడల్ వ్యవస్థేమో! సరే, ఈ జ్ఞానామృత సేవనాన్ని పక్కన బెడితే... నిజంగానే నెహ్రూ సంపన్నుడు. ఆయన తండ్రి మోతీ లాల్ నెహ్రూ ఒక విజయవంతమైన న్యాయవాదిగా రెండు చేతులా ఆర్జించారు. అలహాబాద్ (ప్రస్తుత ప్రయాగ్‌రాజ్)లో ప్యాలెస్ లాంటి 'ఆనందభవన్'ను నిర్మించుకున్నారు. అనంతర కాలంలో ఆ ప్యాలెస్ స్వాతంత్ర్యోద్యమానికీ, కాంగ్రెస్ కార్యకలా పాలకూ కేంద్ర స్థానంగా మారింది. లండన్‌లో నెహ్రూ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రతిష్ఠాత్మకమైన హారో స్కూల్‌లో జరిగింది. కాలేజీ చదువు ట్రినిటీ కాలేజీలో! ఇది కేంబ్రిడ్జి యూనివర్సిటీలో భాగం. ఆక్స్‌ఫర్డ్ కాదు. తర్వాత బారిస్టర్ శిక్షణ కూడా నెహ్రూ తీసుకున్నారు. చంద్రబాబు చెప్పిన 'గేటుకో కారు' అనే చందమామ కథను ఎక్కడి నుంచి సంగ్రహించారో తెలియదు. ప్రామాణిక గ్రంథాల్లో ఈ కథ ఎక్క డైనా ఉన్నదేమో అది చదివినవాళ్లే చెప్పాలి. బాబు జ్ఞానబోధ విన్న ఐఏఎస్‌లు, అధికారులంతా చరిత్ర ప్రసిద్ధిగన్న నెహ్రూ ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' పాఠాన్ని చదివే ఉంటారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి అర్ధరాత్రి జాతినుద్దేశించి ఆయన ప్రసంగించారు. 'అర్ధరాత్రి ప్రపంచమంతా నిద్రిస్తున్న వేళ స్వాతంత్ర్యో ద్యమ లక్ష్యాల సాధన కోసం భారత్ మేల్కొంటున్నది. పేదరికం లేని, అసమానతలకు తావు లేని, రోగాలు రొష్టులెరుగని, అజ్ఞా నాన్ని పారదోలే వ్యవస్థను నిర్మించుకోవడమే జాతి లక్ష్యమ'ని నెహ్రూ ప్రకటించారు. ఇందులో 'ఫ్యూడలిజం' ఎక్కడ ఉన్నదో,




పెత్తందారీతనమెక్కడ ఉన్నదో అధికారులే వెతికి పట్టుకోవాలి. సువిశాలమైన, వైవిధ్యభరితమైన, బహుళ సంస్కృతుల నిలయ మైన, అత్యధిక జనాభా కలిగిన భారత్ అభివృద్ధి గమనాన్ని ఒక చిన్న సిటీ స్టేట్ సింగపూర్‌తో పోల్చడం ఏ రకంగా విధాయకమో విజ్ఞులైన అధికారులు గ్రహించే ఉంటారు. ప్రభుత్వ ఉద్దేశాలను వివరించడానికి, ప్రభుత్వ నిర్ణయాల అమలుకు కార్యోన్ముఖులను చేయడానికి కలెక్టర్ల సమావేశాలను ఏర్పాటు చేస్తుంటారు. ఇటువంటి అధికారిక సమావేశాలను రాజకీయ వేదికలుగా మార్చడం తగునా? దేశ తొలి ప్రధానిని కించపరిచే ఉపన్యాసాలు చేయడం సమంజసమేనా? నెహ్రూ అమలు చేసిన డెమోక్రటిక్ సోషలిస్టు విధానాలు ప్రైవేట్ వ్యాపా రులకు ఊడిగం చేసే నేటి పాలకులకు నచ్చకపోవచ్చు. కానీ, వారసత్వంగా వచ్చిన విలాసవంతమైన జీవితాన్ని కాలదన్ను కొని స్వాతంత్ర్యోద్యమంలో ఒక ముఖ్య సేనానిగా పాల్గొని పదేళ్లకు పైగా జైలు జీవితం గడిపిన త్యాగధనుడిగానైనా ఆయన్ను గుర్తించి గౌరవించాలి కదా! 'సంఘ్ పరివార్'కు ఆది నుంచి నెహ్రూతో సిద్ధాంతపరమైన విభేదాలున్నాయి. చాలా కాలంగా అధికారంలో ఉండి అన్ని హంగులూ అమర్చుకున్నందువల్ల నెహ్రూ వ్యక్తిత్వ హనన కార్యక్రమాన్ని కేంద్ర సర్కార్ పెద్దయెత్తున చేపట్టింది. వాళ్లను సంతృప్తి పరిచే కార్యక్రమంలో భాగంగా ఆంధ్రా ఎన్డీఏ కూటమిలోని భాగస్వాములు ఒకరితో ఒకరు పోటీపడు తున్నట్టున్నారు. బీజేపీ వాళ్లను మించి వీర సనాతనవాదిగా చలామణీ కావడానికి ఇటీవల పవన్ కల్యాణ్ పడిన పాట్లను కూడా గుర్తుకు తెచ్చుకోవాలి. నెహ్రూ విధానాల మీద నిందా ప్రచారం చేయడానికి బీజేపీ వాళ్లు రకరకాల వేదికల్ని ఉపయోగించుకున్నారే గాని, చంద్రబాబు మాదిరిగా ఐఏఎస్‌ల సమావే శాన్ని మాత్రం ఉపయోగించుకున్నట్టు లేదు. ఈ రకంగా బాబు వాళ్లకు ఓ కొత్త దారిని చూపించాడనుకోవాలి. చంద్రబాబు పార్టీతో అంటకాగే అలవాటున్న ఆంధ్ర, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వాళ్లు కూడా చంద్రబాబు వ్యాఖ్యల్ని ఖండించకపోవడం పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. ఇంతకూ బాబు చెబుతున్నట్టు దేశంలో అభివృద్ధి రాహిత్యా నికి కారణమైన నెహ్రూ విధానాలేమిటి? రెండు శతాబ్దాల వలస దోపిడీ అనంతరం భారత్ ఆర్థికంగా చిక్కి శల్యమైంది. యూరప్ పారిశ్రామిక విప్లవం తర్వాత దేశంలో కొత్తగా పరిశ్రమలు రాకపోగా పాతకాలపు పరిశ్రమలు, చేతివృత్తులు మూల పడ్డాయి. బ్రిటన్‌కు ముడిసరుకుల పంపిణీ చేసే దేశంగా మిగిలి పోయింది. ఫలితంగా స్వదేశీ పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి చెందలేదు. అందువల్ల భారీ పరిశ్రమల్ని, రైల్వేలు, నీటిపారు దల ప్రాజెక్టుల వంటి వాటిని ప్రభుత్వమే తలకెత్తుకోవలసి వచ్చింది. స్వదేశీ పెట్టుబడిదారీవర్గం నిర్వహించగలిగిన పరిశ్ర మల స్థాపనకు వారికి అనుమతులివ్వడం జరిగింది. ప్రభుత్వ రంగం, ప్రైవేట్ రంగం పక్కపక్కనే పనిచేయడం వల్ల ఉద్యోగులు, కార్మికుల ఉద్యోగ భద్రత పెరిగింది. మెరుగైన వేతనాలు, సౌకర్యాలు పెరిగాయి. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల ఒక కొత్త మధ్యతరగతి వర్గం తయారైంది. కాలక్రమంలో ప్రైవేట్ రంగంలో పరిశ్రమల స్థాపనకు లైసెన్స్‌రాజ్, రెడ్ టేపిజమ్ ఆటంకంగా మారాయనే విమర్శలు మొదలయ్యాయి. నిజంగానే ఆ కాలంలో (1947%-%1991) ఆర్థిక వృద్ధి రేటు నాలుగు శాతానికి మించి పెరగలేదు. ఫలితంగా ఉద్యోగాల కల్పన మందగించింది. అయితే ఇందుకు ప్రభుత్వ రంగం కారణం కాదు. కాలానుగుణంగా ప్రభుత్వాలు వ్యవహ రించి ఎగుమతి దిగుమతుల్లో ప్రొటెక్షనిస్టు పద్ధతులను సంస్కరించి, కొంతమేరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించి, లైసెన్స్ రాజ్ %-% రెడ్ టేపిజాలను నియంత్రించి ఉంటే సరిపోయేదనే అభిప్రాయాలున్నాయి.

## లంబాడీలు వలసవాదులా.. స్థానికులా? బంజారాల వాస్తవ చరిత్ర

భారతీయ సమాజంలో తరతరాలుగా వివక్షకు, అపోహలకు గురైన వర్గాల్లో బంజారాలది ఒక ప్రత్యేకమైన చరిత్ర. ఒకప్పుడు పృథ్వీరాజ్ చౌహాన్ సైన్యంలో పోరాడిన వీరులుగా, తర్వాత మొఘలుల దాడులకు అడవులు పట్టిన అభాగ్యులుగా, ఆపై బ్రిటీష్ పాలనలో 'క్రిమినల్ ట్రైబ్స్'గా ముద్ర వేయబడిన దొంగలుగా, నేటి సమాజంలో వలసవాదులుగా అనేక అవమానాలు ఎదుర్కొన్నారు. ఈ ఆరోపణలు ఎంతవరకు నిజం? చట్టం, చరిత్ర ఏం చెబుతున్నాయి? ఈ విషయాల గురించి క్షుణ్ణంగా పరిశీలిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయి..

విదేశాల్లో వలస వ్యతిరేక నిరసనల నుండి భారతదేశం నేర్చుకోవాల్సిన పాఠాలు..

ఒకే భాష, ఒకే రకమైన తండా జీవన విధానం, సంస్కృతి, సాంప్రదాయాలు, వస్త్రధారణ కలిగి ఉన్న గోర్ బంజారాలను బ్రిటిష్ ఇండియా కాలంలోనే గిరిజనులుగా గుర్తిం చారు. అయితే స్వాతంత్ర్యం వచ్చాక ఆర్థిక సమానత్వం కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరిచారు. అయితే ఈ గోర్ బంజారాలు దేశంలోని వివిధ ప్రదేశాల్లో వేరువేరు తెగ పేరుతో ఉండటం వల్ల వారిని ఒకే వర్గంగా చేర్చడంలో సమస్యలు తలెత్తాయి. అందుకే వీరందరూ దేశంలోని వివిధ ప్రదేశాల్లో గిరిజన తెగగా కాకుండా ఇతర వర్గాల్లో ఉంటూ కటిక దరిద్రాన్ని, దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. అంతే కాని మొదటి నుండి గోర్ బంజారాలు గిరిజనులు కాదని అనడం సత్యదూరం.

సాహిత్యంతో సాంఘిక సంస్కరణ చేసిన మహాకవి

వ్యాపారస్తులను.. దొంగలుగా చిత్రీకరించి

1857 సమయంలో దేశంలోని ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, వేష భాషలు కలిగి ఉన్న బంజారాలు వ్యాపారం చేసేవారు. బ్రిటీష్ వారు భారతదేశ సంపదను వారి దేశానికి తరలించడానికి రైలు మార్గాలు, జాతీయ రహదారులు వేయడానికి పూను కున్నారు. నాడు బంజారాలు ప్రయాణించిన మార్గాలే రైలు మార్గాలుగా, జాతీయ రహదారులుగా ఏర్పడ్డాయి. దీంతో వీరి వ్యాపారం పూర్తిగా దెబ్బతిని వారి జీవనమే కష్ట తరమైంది. అయితే దేశ సంపదను ఆంగ్లేయులు రైళ్లు, జాతీయ రహదారుల ద్వారా తరలించడం మొదలుపెట్టాక బంజారాలు వాటిపై దాడి చేసి ఆ సంపద దేశ సరిహద్దులు దాటకుండా అడ్డగించేవారు. సంపదను తరలించడం కష్టంగా భావించిన ఆంగ్లేయులు, వారిపై కక్షగట్టిన బ్రిటీషులు భారత గోర్ బంజారాల తండా వ్యవస్థను దెబ్బతీసి, తండా నాయక్‌ల మధ్య చిచ్చు పెట్టి, జాతి ఐకమత్యాన్ని దెబ్బతీస్తూ, ఎదిరించిన వారిని కట్టడి చేయడానికి నాటి బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం వారిని క్రిమినల్స్‌గా చిత్రీకరించి 'క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ ఆఫ్ 1871' జాబితాలో చేర్చి దొంగలుగా చిత్రీకరించి హింసించారు. దీని ద్వారా క్రిమినల్ ట్రైబ్స్‌గా ఆంధ్ర, తెలంగాణ ప్రాంత లంబాడీలనే కాదు, మొత్తం భారత బంజారాలను నాటి బ్రిటిష్ ప్రభుత్వమే గిరిజనులుగా గుర్తించింది.

సామాజిక న్యాయం కోసం ఎదురుచూస్తున్న దళిత వాద

చట్టపరమైన వివక్ష

మద్రాసు ప్రెసిడెన్సీలోని ఆంధ్ర ప్రాంత సుగాలీలు/లంబాడీలను ఎస్టీల జాబితాలో చేర్చారు. అయితే, అప్పటి హైదరాబాద్ సంస్థానంలో 13 గిరిజన తెగల్లో లంబాడీలు గిరిజన తెగగా ఉన్నప్పటికీ, భారత యూనియన్‌లో విలీనం కాకపోవడం వల్ల హైదరాబాద్ సంస్థాన ప్రాంత లంబాడీలను భారత యూనియన్‌లో గిరిజన జాబితాలో చేర్చలేదు. అయితే బ్రిటిష్ కాలంలో క్రిమినల్ ట్రైబ్స్‌గా నోటిఫై చేసిన తెగలను భారత ప్రభుత్వం డి-నోటిఫై చేసి 'డి-నోటిఫైడ్ ట్రైబ్స్' అనే కొత్త గిరిజన జాబితాను రూపొందించింది. ఎస్సీ/ఎస్టీలతో సమానం గా అభివృద్ధి చేయడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిరిజన జాబితాలో లేని లంబాడీలను డీఎన్టీ జాబితాలో చేర్చి విద్య, ఉద్యోగాల్లో హక్కులను కల్పించాయి. ఉమ్మడి రాష్ట్రంలో వీరందరూ ఒకే రాష్ట్రంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనప్పటికీ, ఆంధ్ర ప్రాంత సుగాలీలు/లంబాడీలు గిరిజనులుగా, తెలంగాణ ప్రాంత లంబాడీలు డినోటిఫైడ్ ట్రైబ్స్ గా, ఆపై 1975లో వెనుకబడిన తరగతులుగా 20 సంవత్సరాలు వివక్షకు గురయ్యారు. ఈ వివక్షను తొలగించడానికి లూనావత్ నర్సింగ్ నాయక్, వాగ్యా నాయక్, రమణీబాయి, స్వామీ నాయక్ మొదలైన వారి నాయకత్వంలో అనేక ఉద్యమాలు నిర్వహించారు.

తెలుగు సినిమా పరిశ్రమ ఐటీ రంగం స్థాయికి ఎదగాలంటే..

వలసవాదులా.. స్థానికులా?

ఆ ఉద్యమాల ఫలితంగా, భారతదేశంలోని అనేక రాష్ట్రాల నుండి కొన్ని కులాలు, జాతులను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చాలని, తీసివేయాలని వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించడానికి అనిల్ కే చంద్ర సారథ్యంలో 33 మంది పార్లమెంటు సభ్యులతో కూడిన ఒక ఉన్నత స్థాయి జాయింట్ పార్లమెంటు కమిటీని నియమించారు. 'ఏరియా రిస్ట్రిక్షన్ రిమూవల్ బిల్లు-1976' ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణా ప్రాంత లంబాడీలు డిఎస్టీలుగా, అదే రాష్ట్రంలోని అదే సామాజిక వర్గానికి చెందిన బంజారాలు/ సుగాలీలు గిరిజనులుగా ఉండకూడదని, అలా ఉన్న వారిని ఎస్టీ వర్గంలో ఉండే విధం గా బిల్లు తెచ్చారు. ఈ బిల్లు ద్వారా తెలంగాణలోని

## రాబోయే 3 గంటల్లో తెలంగాణలో భారీ వర్షాలు..

హైదరాబాద్ : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో 3 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. రంగారెడ్డి, యాదాద్రి, సూర్యాపేట, నల్లగొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ నెల 22న నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతారవణ శాఖ తెలిపింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. ఈ నెల 25వ తేదీ నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతం దాని సమీపంలోని ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో ఒక అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. తదుపరి ఆ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశలో కదిలి వాయువ్య దాని సమీపంలోని పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర కోస్తా తీరం సమీపంలో ఈ నెల 26 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు. ఈ వాయుగుండం దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర కోస్తా తీర ప్రాంతంలో ఈ నెల 27 నాటికి తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వివరించారు.

## కశ్మీర్ సమస్య తేలకుండా భారత్‌తో సత్సంబంధాలు అసాధ్యమన్న షెహబాజ్

అది పగటి కలలు కనడమే అవుతుందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్యసమితి సమావేశాలకు హాజరయ్యే ముందు లండన్‌లో ఆయన ప్రవాస పాకిస్థానీలతో జరిగిన ఒక సమావేశంలో మాట్లాడారు. ఇరు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొనాలంటే కశ్మీర్ అంశాన్ని తేల్చాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. "భారత్, పాకిస్థాన్ పొరుగు దేశాలు. మనం కలిసే జీవించాలి. కానీ కశ్మీరీ ప్రజల త్యాగాలు వృథా కారాదు. వారి రక్తం ప్రవహిస్తున్నంత కాలం శాంతి సాధ్యం కాదు. భారత్ సహకరించే ధోరణిలో కాకుండా యుద్ధ వైఖరితో వ్యవహరిస్తోంది" అని షెహబాజ్ విమర్శించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడిపై అంతర్జాతీయ దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో భారత్‌తో జరిగిన నాలుగు యుద్ధాల వల్ల తమ దేశం బిలియన్ల కొద్దీ డాలర్లను నష్టపోయిందని షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ డబ్బును పాకిస్థాన్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేసి ఉంటే దేశం ఎంతో అభివృద్ధి చెందేదని అన్నారు. "మనం ప్రేమతో, పరస్పర గౌరవంతో జీవించాలా లేక పోరాటాలతోనే కొనసాగాలా అన్నది మన చేతుల్లోనే ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కశ్మీర్ అంశాన్ని గాజాలో జరుగుతున్న పరిణామాలతో షెహబాజ్ పోల్చారు. గాజాలో 64 వేల మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, ఇజ్రాయెల్ దురాగతాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కశ్మీర్, గాజా రెండు సమస్యలపైనా అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

# సంపాదకీయం

## అమెరికా ఆధిపత్యం నిలిచేనా

చరిత్ర అనేది ఒక నిరంతర చైతన్య వాహిని. కఠినమైన న్యాయమూర్తి. ఎవరిపైనా పక్షపాతం చూపదు, ఎవరినీ కనికరించదు. ఎంతో గొప్పవారమని ఎవరు భావించినా, తామే శాశ్వత పాలకులమని, ఎప్పటికీ అధినాథులమని ఎవరు అనుకున్నా చరిత్ర ఎప్పుడూ అటువంటి వారికి ఒక గట్టి పాఠం నేర్పింది. అధికారం, సంపదతో పాటు మరేదీ శాశ్వతం కాదని చరిత్రలో పదే పదే రుజువయింది. ఇవి ఎప్పటికీ మరచిపోకూడని పాఠాలు. ఆ సత్యాలు వర్తమాన ప్రపంచానికి, ముఖ్యంగా నేటి అమెరికాకు వర్తిస్తాయి. వంద సంవత్సరాల క్రితం గ్రేట్ బ్రిటన్ సమస్త ప్రపంచానికి ఏకైక నాయకి. ప్రపంచ సంపదలో ఆ దేశానికి 20శాతం కంటే ఎక్కువ వాటా ఉండేది. మానవాళిలో నాలుగో వంతుకు పైగా జనాభా బ్రిటిష్ సామ్రాజ్య పాలనలో ఉండేది. వినూత్న వాణిజ్యాలు, కొత్త పరిశ్రమలు, నవ సాంకేతికతలు సమస్తమూ అన్నీ బ్రిటన్ నుండే ప్రభవించినట్టుండేవి. సప్త సముద్రాలపై బ్రిటిష్ నౌకాదళ సర్వాధిపత్యం తిరుగులేకుండా ఉండేది. లండన్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశదేశాల భవిష్యత్తును మార్చేవి. 'బ్రిటిష్ సామ్రాజ్యంలో సూర్యుడు ఎప్పుడూ అస్తమించడు' అనేది కేవలం మాట కాదు, వాస్తవం. అయితే ఇరవయో శతాబ్ది పూర్వార్థంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాలు బ్రిటన్‌ను గట్టిగా కుదిపేశాయి. ఆ యుద్ధాల వలన బ్రిటన్ సిరిసంపదలు అడుగంటిపోయాయి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య పాలకుల ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది. వలస దేశాల్లో స్వాతంత్ర్య ఉద్యమాలు ఉధృతమయ్యాయి. తొలుత భారత్ విముక్తమయింది. ఆ తరువాత ఆసియా, ఆఫ్రికా దేశాలు క్రమంగా స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భవించాయి. 20వ శతాబ్దం మధ్య నాటికే బ్రిటన్ ఒక సాధారణ యూరోపియన్ దేశంగా మారిపోయింది. ఇప్పటికీ అలాగే మిగిలిపోయి ఉంది. ఒకప్పుడు ప్రపంచాన్ని పాలించిన బ్రిటన్, నేడు తన గత చరిత్ర జ్ఞాపకాలతో కాలాన్ని నెట్టుకొస్తున్నది. రెండు శతాబ్దాల క్రితం యూరప్ ఖండంలో ఫ్రాన్స్ అత్యంత శక్తిమంతమైన దేశంగా వెలిగింది. నెపోలియన్ చక్రవర్తి సైన్యాలు యూరప్ అంతటినీ జయించాయి. నెపోలియన్ అజేయుడని భావించేవారు. ఫ్రెంచ్ సంస్కృతి, కళలు, భాష సమస్త ప్రపంచాన్నీ ఆకర్షించాయి. తన పాలన శాశ్వతమని నెపోలియన్ విశ్వసించాడు. ఆ వివేకరాహిత్యమే అతడిని దెబ్బ తీసింది. నిరంతర యుద్ధాలు ఫ్రాన్స్ ఆర్థిక వనరులను హరించివేశాయి. బ్రిటన్, ఇతర యూరోపియన్ దేశాలు సమైక్యంగా నెపోలియన్‌పై దండెత్తాయి. చివరికి అతడిని ఓడించి, ఒక సుదూర దీవిలో ఒంటరిగా బంధించాయి. ఫ్రాన్స్ ఆధిపత్యం తగ్గిపోయింది. ఆ తరువాత కూడా ఫ్రాన్స్ సాటిలేని ఒక సాంస్కృతిక, ఆర్థిక శక్తిగా నిలిచినా, సామ్రాజ్యాధిపత్యాన్ని మాత్రం కోల్పోయింది. నాలుగు శతాబ్దాల క్రితం స్పెయిన్ ప్రపంచ సముద్రాలపై తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది. ఆసియాలోని ఫిలిప్పీన్స్‌లో మనీలా నుంచి ఉత్తర అమెరికాలోని మెక్సికో వరకూ సువిశాల భూభాగాలు స్పెయిన్ పాలనలో ఉండేవి. వెండి, బంగారం, సుగంధ ద్రవ్యాలు, పట్టుతో నిండిన నౌకలు తరలివచ్చేవి. స్పానిష్ రాజవంశం తమ పాలన దేవదత్తమని, శాశ్వతమని నమ్మింది. కానీ తన సంపదను సరైన విధంగా ఉపయోగించలేదు. మితిమీరిన ఖర్చులు చేసింది. ప్రబలిపోయిన మత అసహనం, యుద్ధాలు, దోపిడీలు... ఇవన్నీ స్పెయిన్ శక్తి సామర్థ్యాలను క్రమంగా క్షీణింపచేశాయి. 19వ శతాబ్దంలో లాటిన్ అమెరికా దేశాలు స్పెయిన్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం సాధించాయి. ఒకప్పుడు బంగారం, వెండి నిల్వలతో మెరిసిన స్పెయిన్ సామ్రాజ్యాన్ని కోల్పోయిన తరువాత యూరప్‌లో ఒక సాధారణ దేశంగా మిగిలిపోయింది. బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్%-% ఈ మూడు దేశాల పతనం వెనక ఒకే కారణం ఉన్నది%-% తాము శాశ్వతమని నమ్మడం. బ్రిటన్ తన పాలనా విధానమే ఉత్తమమని భావించింది. ఫ్రాన్స్ తన సైన్యం ఎప్పటికీ అజేయమని అనుకుంది. స్పెయిన్ తన బంగారం ఎప్పటికీ తరుగదని విశ్వసించింది. అయితే కాలం అన్నది ఎవరి కోసం ఆగదు. చరిత్ర ముందుకు సాగిపోయింది. ప్రతి సామ్రాజ్యం ఎప్పటికైనా కూలిపోతుందనే సత్యాన్ని స్పెయిన్, ఫ్రాన్స్, బ్రిటన్ చరిత్ర రుజువు చేసింది. ప్రస్తుత ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యంగా పేరుబడిన అమెరికా కూడా నెమ్మదిగా గతించిన సామ్రాజ్యాల బాటలో నడుస్తున్నది. ఇరవయో శతాబ్దం తొలినాళ్ల నుంచి ఇప్పటి వరకు అమెరికా తిరుగులేని ఆర్థిక, సైనిక శక్తిగా, సాంకేతిక ఆవిష్కరణలలో అగ్రగామిగా వెలుగొందింది. డాలర్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన కరెన్సీగా మార్చి, ఇతర దేశాలపై తన ప్రభావాన్ని చూపుతున్నది. అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ప్రతిభావంతులను ఆకర్షించే అవకాశాలు అన్నీ అమెరికాలోనే కేంద్రీకృతమయ్యాయి. అంతేకాదు, అనేక దేశాల్లో సైనిక స్థావరాలను నెలకొల్పి తన కుయుక్తిని ప్రదర్శిస్తున్నది. ప్రపంచ నాయకత్వం తనకు మాత్రమే సొంతం అనే అహంభావాన్ని సుదీర్ఘ కాలంగా కొనసాగిస్తున్నది. అయితే కాలం మారింది. అంతర్గతంగా, బాహ్యంగా అమెరికా ఇప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. దేశీయంగా రాజకీయ అస్థిరత పెరిగిపోతున్నది. పార్టీ విభేదాలు, విధానాల్లో అస్పష్టత, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నాయి. ధనిక%-%పేదల మధ్య అసమానతలు ఆందోళనకర స్థాయికి చేరాయి. జాత్యహంకారం, వర్ణ వివక్ష ఇంకా పూర్తిగా అంతరించలేదు. ఫలితంగా, అమెరికా ప్రజలు ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వాలపై నమ్మకం కోల్పోతున్నారు. విదేశీ సంబంధాలలో కూడా అమెరికా పరిస్థితి మునుపటిలా లేదు. చైనా, భారత్, బ్రెజిల్, టర్కీ మొదలైన దేశాలు వేగంగా ఎదుగుతున్నాయి. సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలు పాశ్చాత్య దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో కూడా జరుగుతున్నాయి. ఒకప్పుడు అమెరికా చెప్పిన మాటే తుది నిర్ణయంగా

# మారిన శ్లాబుల మురిపెం




ఎటు చూసినా నిరాశామయ వాతావరణమే అలుముకుని అంతటా నిర్లిప్తత ఏర్పడిన తరుణంలో బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన అందరిలోనూ ఉత్సాహం నింపింది. ఈ క్షణం కోసం సామాన్యులు మొదలుకొని రైతులూ, చిరు వ్యాపారులూ, చిన్నా చితకా పరిశ్రమలవారూ ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. సరుకులు, సేవల పన్ను (జీఎస్‌టీ)ను హేతుబద్ధీకరిస్తూ, సాధారణ ప్రజానీకం వాడే అనేకానేక నిత్యావసరాలకు పన్ను తగ్గించటం లేదా పూర్తిగా ఎత్తేయటం... ఆరోగ్య బీమాకు పన్నుపోటు నుంచి మినహాయించటం తదితరాలు ఇప్పుడున్న గడ్డు పరిస్థితుల్లో ఊరట నిస్తాయి. సామాన్యుల్లో జీఎస్‌టీ 'గబ్బర్‌సింగ్ టాక్స్'గా అపకీర్తి పాలైందంటేనే వారిని ఎంతగా కష్టపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. త్వరలోనే పన్నుల హేతుబద్ధీకరణను అమలు చేయబోతున్నామని పదే పదే ప్రకటించటంతో జీఎస్‌టీ మండలి సమావేశమైనప్పుడల్లా అందరిలోనూ ఆశలు చిగురించేవి. తీరా మరిన్ని సరుకుల్ని జీఎస్‌టీ పరిధిలోకి తీసుకురావటంతో వారంతా బిత్తరపోయేవారు. ప్రధాన రాష్ట్రాల ఎన్నికలు జరిగినప్పుడూ, వార్షిక బడ్జెట్‌లు ప్రవేశపెట్టినప్పుడూ జీఎస్‌టీ తగ్గింపుపై ఊహాగానాలు రావటం, చివరకు నిట్టూర్చటం రివాజైపోయింది. ఈ దశలో మొన్నటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్‌టీని సరళీకృతం చేయబోతున్నామని వెల్లడించారు. మొత్తానికి ఇప్పుడిక 5 శాతం, 18 శాతం పన్నుల విధానం అమలు కాబోతోంది. ఆరంభమైన మొదలుకొని జీఎస్‌టీని ఎవరూ మెచ్చింది లేదు. తమ ఆదాయ వనరులకు గండి కొట్టిందని రాష్ట్రాలూ, తమ జేబులు కత్తిరిస్తోందని మధ్యతరగతి జీవులూ,ఎంతో కష్టపడి సంపాదిస్తున్నది కాస్తా జీఎస్‌టీ పేరు మీద ప్రభుత్వం తన్నుకు పోతున్నదని వ్యాపారులూ ఆక్రోశిస్తూనే ఉన్నారు. జీఎస్‌టీ చిత్రవిచిత్రాలు పోయింది. వడాపావ్ వెన్నతో తింటే ఒక రకమైన పన్ను, అది లేకుండా తింటే వేరే రకం పన్ను వేయటాన్ని జనం జీర్ణించుకోలేకపోయారు. ఆ మధ్య నిర్మలా సీతారామన్ సమక్షంలో ఒక వ్యాపారవేత్త జీఎస్‌టీపై వెటకారంగా వ్యాఖ్యానించటం, ఆ వీడియో కాస్తా వైరల్ కావటంతో ఆయన కంగారుపడి మంత్రిని కలిసి క్షమాపణలు చెప్పటం అందరికీ తెలుసు. జీఎస్‌టీ అరాచకం అంతా ఇంతా కాదు. సబ్బు, షాంపూలపై 18 శాతం, స్కూలు పుస్తకాలు, పెన్సిళ్లు, రంగు పెన్సిళ్లు తదితరాలపై 12 శాతం, ఆఖరికి కోచింగ్ తీసుకుంటే 18 శాతం పన్నులతో ఎడాపెడా బాదటం అందరినీ దిగ్భ్రాంతి పరిచింది. అయినా కేంద్రంలో కదలిక రాలేదు. అమెరికా విధించిన 50 శాతం సుంకాల వల్ల ఎదురుకాగల సమస్యల్ని దృష్టిలో ఉంచుకునే కేంద్రంలో కదలిక వచ్చిందని ఆర్థిక నిపుణులంటున్నారు. ఆ సంగతలా ఉంచితే ప్రజల్లో వినిమయాన్ని పెంచి ఆర్థిక వ్యవస్థకు జవజీవాలు తీసుకురావటానికి తాజా నిర్ణయాలు దోహదపడతాయి. ప్రభుత్వాలు ఆదాయాన్ని పెంచుకోవటానికి ఎంతసేపూ పరోక్ష పన్నులపైనే ఆధారపడతాయి. ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పోలిస్తే నిజానికిది చాలా తక్కువ. కానీ పారిశ్రామికవేత్తలనూ, సంపన్నులనూ నొప్పించటం ప్రభుత్వాలకు ఇష్టం ఉండదు. వాళ్లంతా ఉపాధి కల్పనలో పాలుపంచుకుంటున్నారన్న కారణం చెబు తారు. పరోక్ష పన్నుల్ని 'తిరోగమనం'గా అభివర్ణించేవారు కూడా ఉన్నారు. సినిమా టిక్కెట్లపై విధించే వినోదపు పన్నునే వారు ఉదాహరిస్తారు. సామాన్యుడికైనా, కోట్లకు పడగెత్తిన సంపన్నుడికైనా ఆ పన్ను ఒకేలా ఉంటుంది. అయితే పన్ను విధింపులో కాస్తంత హేతుబద్ధత చూపటం ద్వారా సామాన్యుల్ని కూడా సంతుష్టి పరచవచ్చు. అర్థశాస్త్రంలోని 'లేఫర్ కర్వ్' భావన అటువంటిదే. పన్నులు తక్కువగా ఉంటే సామాన్య జనం అధికంగా కొని ఖజానా ఆదాయాన్ని పెంచుతారని ఈ భావన చెబుతుంది. కానీ ప్రభుత్వాలు ఎంతసేపూ అధిక పన్నుల ద్వారా అధికాదాయం అనే ఆలోచనలోనే ఉంటాయి. అధిక పన్నులూ, వాటిని చెల్లించలేదంటూ వేధింపులూ వగైరాలను 'ట్యాక్స్ టెర్రరిజం'గా కొందరు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు మైలురాయి వంటివా... కాదా అన్నది రానున్న కాలంలో తేలిపోతుంది. పనిలో పనిగా జీఎస్‌టీ వల్ల రాష్ట్రాలకు కలుగుతున్న నష్టాన్ని భర్తీ చేసే యోచన కూడా చేస్తే దేశంలో ఫెడరలిజం వర్ధిల్లుతుంది.

# విద్యను పంచే కాంతిప్రదాతలు..

'నేను అధిరోహించిన పదవుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి నాకు అత్యంత ప్రియమైనది. అధ్యాపకుడిగా నేను పాఠాలు బోధించాను అని చెప్పుకోవడానికి ఎంతో గర్విస్తాను. నా దృష్టిలో అత్యంత ఆరాధ్య నియమైనది ఉపాధ్యాయ వృత్తి' అని భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు అంటారు. బోధన మాత్రమే కాదు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసి, నిరంతరం వారిలో స్ఫూర్తి నింపుతూ విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతున్న సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు.

అమెరికాను సామ్రాజ్యవాదాన్ని పారదోలలేమా? చైనాకు సాధ్యమయింది మనకు సాధ్యం కాదా?

### ఎలా జీవించాలో నేర్పేవారు..

ప్రపంచాన్ని మార్చగల శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమే, ఆ విద్యను విద్యార్థులకు పంచే క్రాంతి ప్రదాతలు ఉపాధ్యాయులే. ఏ సమాజం అభివృద్ధి చెందాలన్నా విద్యారంగం అభివృద్ధి చెందాల్సిందే. జ్ఞానంపై పెట్టుబడి ఎల్లప్పుడూ సమాజానికీ అద్భుతమైన ఫలితాలను అందిస్తుంది. ఒక ఉపాధ్యాయుడు పుస్తకంలోని అక్షరాలను మాత్రమే కాదు జీవితంలో ఎలా జీవించాలో నేర్పుతాడు. విద్యార్థుల దృష్టి ప్రస్తుతం గ్యాడ్జెట్‌లపై, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాప్‌లపై ఎక్కువగా ఉంటుంది. వీటి ద్వారా అందుబాటులో బోలెడంత సమాచారం ఉంటుంది. ఆ సమాచారాన్ని సరియైన మార్గంలో ఉపయోగించే విధానాన్ని విద్యార్థులకు నేటి ఉపాధ్యాయులు నేర్పాల్సి ఉంది.

అధ్యాపకులకు ఈ గుణాత్మక విలువలుండాలి! తరగతి గదిలో చెప్పేదొకటి, బయట చేసేదొకటిగా ఉండకూడదు!

### ఏఐ.. టీచర్‌కు ప్రత్యామ్నాయం కాదు!

సమాజంలో విశిష్ట స్థానంలో ఉన్న ఉపాధ్యాయులు నాటితో పోల్చితే నేడు సమాజంలో గౌరవ మర్యాదలు తగ్గాయి. దీనికి కారణం కార్పొరేట్ శక్తులు, ప్రభుత్వాల విధానపర నిర్ణయాలు, ఉపాధ్యాయుల స్వాలాభేక్ష. వ్యాపార దృక్పథం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం. ముఖ్యంగా సోషల్ మీడియా ప్రభావం. సాంకేతికతను గురువుకు ప్రత్యామ్నాయంగా వినియోగించడం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధ్యాయులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే ఏ సాంకేతిక పరిజ్ఞానం కూడా ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం కాదనే విషయాన్ని మనం గమనించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంత వరకు వాడాలో అంతే వాడితే సత్ఫలితాలు ఇస్తాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు



బోధన అభ్యసన కార్యక్రమంలో భాగంగా అతిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆధారపడటం వల్ల వారి సృజనాత్మకత అభివృద్ధి చెందకుండా పోతుంది.

### మేమూ ఉత్తమ ఉపాధ్యాయులమే!

### టీచర్లు.. నవ భారత్ నిర్ణేతలు

అనేక మంది గురువులు సమాజం కోసం వారి జీవితాలను త్యాగం చేస్తూ సమాజానికి దిక్సూచిగా నిలుస్తున్నారు. నాడు ఉపాధ్యాయులు వారు పనిచేసే ప్రాంతంలో నివసిస్తూ ప్రజలతో మమేకం అయ్యేవారు. వారి కష్ట సుఖాల్లో భాగస్వాములై, అనేక సామాజిక ఉద్యమాలకు రూపకర్తలుగా మారారు. సామాజిక సమస్యలపై ప్రజలతో పాటు ఉపాధ్యాయులు కూడా ముందు వరుసలో ఉండి ప్రజల కోసం పోరాడేవారు. అందుకే ప్రజల్లో ఉపాధ్యాయులను గొప్ప వ్యక్తులుగా చూసేవారు. రాజకీయాలను కూడా ప్రభావితం చేసే స్థాయిలో నాటి తరం ఉపాధ్యాయులు ఉండేవారని అనడంలో అతిశయోక్తి లేదు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి ఉపాధ్యాయులలో లేవు. అందుకే వారికి ఈ పరిస్థితి వచ్చింది.

### పుస్తక పఠనాన్ని మళ్లీ ప్రోత్సహిద్దాం!

### వృత్తిని పవిత్ర కార్యంగా భావిస్తూ..

దేశంలో, భవిష్యత్ తరాలకు అవసరమయ్యే నూతన ఆవిష్కరణలు చేయడంలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం చాలా ముఖ్యమైంది. ఉపాధ్యాయుల మార్గదర్శనంలో నవభారత నిర్మాణం జరుగుతుందని, ప్రపంచ దేశాల్లో భారతదేశం అగ్రస్థానంలో నిలుస్తుందని ఆశిద్దాం. తమ వృత్తిని పవిత్ర కార్యంగా భావించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ, సమాజ సేవకులుగా, నవభారత ప్రగతిశీల శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన రూప శిల్పులుగా రూపొందిస్తున్న ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.

# అమెరికాను సామ్రాజ్యవాదాన్ని పారదోలలేమా?

### చైనాకు సాధ్యమయింది మనకు సాధ్యం కాదా?

భారత్‌లో ఆనాటి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీనే మించిపోయింది ఈనాటి అమెరికా సామ్రాజ్యవాదం. మన దేశాభివృద్ధికి మన పాలకులు అనుసరించే ఆర్థిక అభివృద్ధి, సంరక్షణ విధానాలను ప్రశ్నించేందుకు, ఎదిరించేందుకు అమెరికా ప్రెసిడెంట్ ఎవరు? వ్యవసాయం, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ మొదలైన ప్రాథమిక రంగాల నుంచి పారిశ్రామిక రక్షణ రంగాల వరకు మనం చేపట్టే విధానాలను ఎప్పుడూ వ్యతిరేకించడమేనా? అమెరికా పని. ఇలాంటి బెదిరింపులకు భారత్ లొంగకుండా స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోవాలి. జాతీయవాదంతో మనం వలస పాలనను పారదోలినట్టు ఈ సామ్రాజ్యవాదుల నయా వలస పాలనను కూడా పారదోలాలి.

అధ్యాపకులకు ఈ గుణాత్మక విలువలుండాలి! తరగతి గదిలో చెప్పేదొకటి, బయట చేసేదొకటిగా ఉండకూడదు!

అమెరికాలో 50 లక్షల మంది ఇండియన్ అమెరికన్లు ఆ దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని తరచూ అభినందిస్తూ ఉంటారు. వీరు పెద్ద టెక్ సంస్థలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫైనాన్షియల్ సంస్థలను నడుపుతున్నారు. విద్యా విధాన నిర్ణయాత్మక సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నారు. అమెరికాకు మనవాళ్లు ఇంత చేస్తున్నా.. ఇండియా పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరు చూసి వారికి విచారం వేయడం న్యాయమే కదా!

### విద్యను పంచే కాంతిప్రదాతలు..

### వ్యతిరేకిస్తే నియంతగా వ్యవహరిస్తారా?

అమెరికా తాను ఆపాదించుకున్న ప్రపంచ పెద్దన్న పెద్దరికంతో తాను విశ్వసనీయ భాగస్వామిగా గుర్తించాలంటే అమెరికా కనుసనాల్లో ఉండాల్సిందేనా? వ్యతిరేకిస్తే నియంతగా వ్యవహరిస్తారా? భారతదేశపు మార్కెట్ చాలా పెద్దదని అమెరికాకు తెలుసు. అమెరికాతో మనం శాస్త్ర సాంకేతిక రంగాలలో పోటీ పడుతున్నామని కూడా తెలుసు. మన మానవ వనరులు అమెరికా దేశాభివృద్ధికి ఎలా తోడ్పడుతున్నాయో తెలుసు.. మన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, విద్యావంతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌గా, డాక్టర్స్‌గా ఇతర సేవా రంగాలు, అమెరికా శాస్త్ర సాంకేతిక రంగాలలో తోడ్పడుతున్నారు. మార్కెట్ రీత్యా గాని మానవ వనరుల అభివృద్ధి పరంగా గాని భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అయితే పటిష్టవంతమైన ఆర్థిక విధానాలు, ప్రభుత్వ నియంత్రణ లేనందున స్వయం పోషకత్వంలో చైనా లాగా మనం నిలదొక్కులేకపోతున్నాం. సామ్యవాద తరహా సమాజం నుంచి పెట్టుబడిదారి సమాజం వైపు అడుగులు వేశాం. దీనివలన ప్రపంచ పెట్టుబడిదారీ దేశాల కనుసనల్లో ముఖ్యంగా అమెరికా విధానాలకు లోబడిపోయే పరిస్థితి ఏర్పడింది.

మేమూ ఉత్తమ ఉపాధ్యాయులమే!




అమెరికాను చైనా ఎలా భయపెడుతోంది?

78 సంవత్సరాలుగా అనేక సందర్భాలలో అమెరికన్ సామ్రాజ్యవాదం తన ఆదేశాలను పాటించాలని ఇండియా ను బెదిరిస్తుంది. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలినియర్ల రాజ్యం వైపుగా భారత్ ఇప్పటికే పునాదులు వేసుకున్నది. ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకమైపోయింది. బడా బుర్జువా వర్గ ప్రయోజనాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలను, దేశాభివృద్ధిని ఆర్థిక వ్యవస్థ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకో గలదా? అగ్రరాజ్యం అని చెప్పుకునే అమెరికా తమ పెట్టు బడిదారులను ప్రోత్సహించి ప్రపంచ పెట్టుబడిదారులను నియంత్రించే పరిస్థితి ఉన్నది. నేడు ప్రభుత్వ పాలన పెట్టు బడిదారీ కనుసన్నల్లో కాకుండా ప్రజలను శాస్త్ర సాంకేతిక రంగాలలో మమేకం చేసి వస్తు ఉత్పత్తి చేస్తే ఎవరికీ ఏమీ మనం తీసిపోం. చైనాలో చాలామంది మంత్రులు శాస్త్ర సాంకేతిక రంగాలలో నిష్ణాతులు కావడం వలన అక్కడ ప్రజలు పాలన ఉత్పత్తి ప్రపంచ పోటీని తట్టుకొని అగ్రరాజ్యం అమెరికాను కూడా భయపెడుతున్నది. అటువంటి ప్రభుత్వాలు మనకు ఏవి?

### పుస్తక పఠనాన్ని మళ్లీ ప్రోత్సహిద్దాం!

### ప్రపంచ మార్కెట్‌ను ఎదుర్కోవాలంటే?

నరేంద్ర మోడీ, నెహ్రూ మాదిరి కాకుండా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. పారిశ్రామిక విధానాలలో అడ్డంకులు లేకుండా చేస్తున్నారు. కీలకమైన ఖనిజాలు, ఎలక్ట్రానిక్స్, రక్షణ ఎరువులు, తదితర రంగాలు అభివృద్ధి కోసం మనం ప్రయత్నం చేయాలని 79వ స్వాతంత్ర దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించారు. ఇది నెహ్రూ విధానాల కన్నా భిన్నమైనది. స్వావలంబన దిశగా మనదేశం అభివృద్ధి చెందాలంటే స్వదేశీ మార్కెట్‌ను సాంకేతిక పరిజ్ఞానంతో ప్రభుత్వం అభివృద్ధి చేయాలి. ప్రపంచ మార్కెట్‌ను ఎదుర్కోవడానికి ఏం చేయాలో ప్రణాళిక రూపకల్పన జరగాలి. ఇప్పుడు అగ్రరాజ్యాన్ని సవాల్ చేసే రీతిలో అభివృద్ధి మన దేశంలో జరగాలి. స్వావలంబనకు భారత్ ఇప్పుడు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటుంది. ఆ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సామ్రాజ్యవాద పెత్తనం నుండి మన దేశం బయటపడాలి.

### భారతీయ వస్తువులనే కొనాలి!

అమెరికా చేస్తున్న ఎలాంటి బెదిరింపులకు భారత్ లొంగకుండా స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోవాలి. జాతీయ వాదంతో మనం వలస పాలన పారదోలినట్టు ఈ సామ్రాజ్యవాదుల నయా వలస పాలన కూడా పారదోలాలి. దేశాన్ని గ్లోబలైజేషన్ అనగా అమెరికా, యూరోప్ దేశాలపై ఆధారపడే ప్రభుత్వ విధానాల నుంచి తప్పించి స్వయం పోషకత్వ విధానాల వైపు ప్రభుత్వ విధానాలు ఉండాలి. ప్రపంచ ఆర్థిక రంగం ఎదుర్కొంటున్న ఈ సుంకాల వలయం నుంచి బయటకు రావాలంటే మన సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాధాన్యత ఇవ్వాలి. మరలా వలస పాలనకు వ్యతిరేకంగా ఆనాడు విదేశీ వస్త్ర బహిష్కరణ చేసి, స్వదేశీ వస్త్రాలైన ఖాదీ ధరించినట్లుగా ప్రస్తుతం భారతీయులు తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేయాలని మనం గుర్తించాలి. ముందుగా మన అవసరాలు తీర్చుకోవాలి. విదేశీ ఉత్పత్తులపై ఆధారపడకుండా చూసుకోవాలి.

# స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్ పట్ల విద్యార్థులకు అవగాహన అవసరం





రణస్థలం **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలపట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం చాలా అవసరమని ఎచ్చర్ల శాసన సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)అన్నారు. సర్పంచ్ రజనీఎన్ ఈ ఆర్‌లిఆధ్వర్యంలో బంటుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర %-% స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)హాజరైనారు. విద్యార్థులు, అధికారులు, ప్రజలతో కలిసి పాఠశాల ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు, పాఠశాల ఆవరణలో ఎంపీ, ఎమ్మెల్యే లు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌదరి అవినాష్, లంక శ్యామలరావు, పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి బానోజీ నాయుడు, రౌతు శ్రీనివాసరావు, గొర్లె సాయిదీప్,దన్నాన మహేష్, మన్నె కృష్ణానందం, తొంపల అప్పలరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తొలితరం ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ!

### మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వెల్ది వెంకటేశ్వర్లు



ఆత్మకూర్/ కదిలించే వార్త/ సెప్టెంబర్ 21: తెలంగాణ సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన తొలి తరం నేత కొండ లక్ష్మణ్ బాపూజీ అని ఆత్మకూర్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వెళ్లే వెంకటేశ్వర్లు కొనియాడారు. ఆదివారం కొండ లక్ష్మణ్ బాపూజీ 13 వ వర్ధంతిని పురస్కరించుకొని ఆత్మకూరులో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమ్మక్కపోశెట్టి ముద్దుల తనయుడైన లక్ష్మణ్ బాపూజీ, నైజాం నవాబుల గుండెల్లో సింహ స్వప్నమై నిలిచారన్నారుపౌర హక్కుల కోసం స్వాతంత్ర సమరంలో చేరాడని తెలంగాణ విముక్తి కొరకు నిజాం గుండెల్లో గుణపమైనిలిచాడని అన్నారు తెలంగాణ తొలితరం ఉద్యమకారులు హైదరాబాదు నడి ఒడ్డున జలదృశ్యంలోని తన సొంత భూమిని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనె ఆశయంగా అందించిన ఘనత బాపూజీ కే దక్కిందన్నారు తెలంగాణే శ్వాసగా తన జీవితాన్ని మొత్తం త్యాగం చేసిన గొప్ప స్వాతంత్ర సమరయోధులు తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసి 90 ఎళ్ల వయసులో జ%శీ%తర్ మంతర్ వద్ద ఎముకలు కొరికే చలిలో దీక్ష చేసిన గొప్ప తెలంగాణ వాది అని అలాంటి వారి ఆశయాల అనుగుణంగా ప్రజలందరం చైతన్య పరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి వడ్డేపల్లి ప్రసాద్, ఆత్మకూరు గ్రామ ప్రధాన కార్యదర్శి మార్త కేదారి, పద్మశాలి యూత్ అధ్యక్షులు మార్త రంజిత్ కుమార్, యూత్ ప్రధాన కార్యదర్శి అల్వాల రవి,కొంపల్లి రవి, చిమ్మని బిక్షపతి,వెల్దే సుదర్శన్,మాచర్ల సదానందం, బూర దశరథం,వెల్దే రాజు, వడ్డేపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాదాసి సురేష్ నీతులు చెప్పే స్థాయి నీకు లేదు

### రమణారెడ్డి ఫైర్



ఆత్మకూరు/ **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** మండలంలోని నాగయ్యపల్లెలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నేరెళ్ల రమణారెడ్డి మాదాసి సురేష్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేసిన సురేష్‌ను ఆయన ఎద్దేవా చేస్తూ "దమ్ముంటే ఆధారాలు చూపించు. సోషల్ మీడియాలో ఏదో తప్పుడు ప్రచారం చేసి ప్రజలను తప్పుదారి పట్టించడం మానుకో. అంబేద్కర్ విగ్రహం పేరుతో నిధులు వసూలు చేసి ఇప్పటికీ విగ్రహం పెట్టని నీకు మాకు నీతులు చెప్పే స్థాయి లేదు. పాడి గేదెల ఎంపిక మహిళా సంఘాల ఆధ్వర్యంలో విజయ డైరీ ద్వారా జరిగింది, ఎస్సీ కార్పొరేషన్ నిధులకు సంబంధం లేదు. మరోసారి తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు జింక అశోక్, కమిటీ సభ్యులు మాదాసి శిల్పా శ్రీనివాస్, గిన్నారపు భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ పోగుల సుగుణాకర్, మాదాసి ప్రవీణ్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుండాల క్రాంతి, యువకాంగ్రెసు సభ్యులు మాదాసి నవీన్ మాధవ్, మాదాసి కౌశిక్, గుండాల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

### సంత కొవ్వూరు లోస్వస్థ నారీ

## - శశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాం -



**కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** సంతకోవూరులోస్వస్థ నారీ - సశక్తి పరివార్ అభియాన్ ప్రోగ్రాం ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నందు డాక్టర్. శ్రావణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిరి. ఈకార్యక్రమమును డిప్యూటీ డి.యం అండ్ హెచ్.ఓ పర్యవేక్షించిరి ఈ కార్యక్రమం లో ప్రజాప్రతినిధులు వి.ఓబులేసు సర్పంచ్ ,జెడ్.పి.టి.సి బి.రామమునిరెడ్డి, రామ సూరరెడ్డి, వి.గంగయ్య యాదవ్ లు కలిసి ప్రతిజ్ఞతో ప్రారంభించి రి. మరియు స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్లు సిరి జనరల్ ఫిజీషియన్ మనస్విని గర్భకోశ వ్యాధుల స్పెషలిస్ట్, డా.వై.సారికారెడ్డి దంత వైద్యులు , డాక్టర్. బి.యన్. నాయక్ ప్రజలకు వైద్యసేవలు అందించిరి. జి.వి లక్ష్మీదేవి అప్తాల్మిక్ ఆఫీసర్ కంటిపరీక్షలు నిర్వహించారు.డి ప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఆర్.ప్రసన్నలత కిశోరబాలికలకు , గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించిరి. ఐ. సి.టి.సి కౌన్సిలర్. కె.వెంకటసుబ్బయ్య హెచ్.ఐ.వి గురించి అవగాహన కల్పించిరి.ఆరోగ్యమిత్ర సురేష్ రెడ్డి అభ రిజిస్ట్రేషన్, ఆరోగ్య విస్తారణాధికారి డి సుబ్రమణ్యం అంటువ్యాధులైన మలేరియా, టి.బి , దయేరియా మొదలగు వ్యాధులపై అవగాహన కల్పించారు. సుపర్వైసర్ . యం ఆర్.రాధారుక్మిణి మాతాశిశు సంరక్షణ సేవలగురించి అవగాహన కల్పించారు. పి.హెచ్.సి సిబ్బంది, సి.హెచ్. ఓ లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు గర్భవతులకు శ్రీమంతమ్ చేసి వారిని సారె తో సత్కరించి పౌష్టికాహారం అందజేశారు.

## నేటి నుండి దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం



పులివెందుల **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** పులివెందుల పట్టణ పరిధిలో కొలువై ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మరియు అంకాలమ్మ దేవస్థానంలో శ్రీ పద్మావతి వెంకటరమణ స్వామి ఆలయాలలో నేటి నుండి దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలను ఆయా ఆలయాల చైర్మన్లు నిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల నిర్వాహకులు చైర్మన్లు మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ మూడో తేదీ వరకు 11 రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయని, రంగురంగుల విద్యుత్ దీపాలతో, అమ్మవారి అలంకరణ ఉంటుందని తెలియజేస్తూ ఈనెల 22న ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి బాలా త్రిపుర సుందరి దేవి అలంకారాలతో మొదలుకొని ప్రతిరోజు ఒక్కొక్క రూపంలో దేవి అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చునని , పై ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు చైర్మన్లు కార్యనిర్వాహకులు ఎండోమెంట్ సిబ్బంది ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించబడునని, సేవా సభ్యుల సహాయ సహకారాలతో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, పులివెందుల పట్టణ మరియు పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి ఉత్సవాలను తిలకించి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

## మానవత సేవ గొప్పది ఎంఈఓ రామకృష్ణయ్య




పులివెందుల **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** పులివెందులబిమానవత సంస్థ చేస్తున్న సేవా నిరతి గొప్పదని లింగాల ఎంఈఓ రామకృష్ణయ అన్నారు. పులివెందుల పులివెందుల గీతా మందిరములో మానవతా ప్రెసిడెంట్ జి చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా రామకృష్ణయ్య మాట్లాడుతూ ఎంతోమంది మానవతా సంస్థ లొ సభ్యులుగా చేరి స్వచ్చందంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుండడం గొప్ప విషయం అన్నారు. మరో అతిధి బాబు రెడ్డి హెచ్ఎం అగుడూరు మాట్లాడుతూ మానవతా సంస్థ లో చేరడమే గొప్ప అర్హతగా అభివర్ణించారు. సంస్థ పూర్వపరాలు సేవా కార్యక్రమాలను సవివరంగా తెలియజేశారు. మానవతా చైర్మన్ డి వి కొండారెడ్డి, ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి సంస్థ కార్యకలాపాలను సభ్యత్వ నమోదు తదితర అంశాలను సవివరంగా వివరించారు. మానవతా కార్యకలాపాలకు సభ్యులు మరింత సహాయ సహకారాలు అందివ్వాలని ఎస్సీ ఎస్ ఆర్ అధినేత సా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తమ ప్రసంగంలో సేవా గుణము, సేవా తత్పరత ప్రతి మనిషి కలిగి ఉండాలని కోరారు. ఆ గుణాలు కలిగిన వారే సంస్థలో చేరి సేవలందిస్తున్నారని చెప్పారు. మానవతా సంస్థ కోశాధికారి బండి హరిచంద్ర రెడ్డి ఈ నెలలో సంస్థ చేపట్టిన కార్యక్రమాలను తదుపరి చేపట్టవలసిన కార్యక్రమాలను విపులంగా సభ్యులకు తెలియజేశారు. రిటైర్డ్ ఏఎస్ డబ్ల్యు ఓ గురు ప్రసాద్ సభ్యులకు అల్పాహారమును ఏర్పాటు చేశారు. మానవతా కార్యవర్గ సభ్యులు చాలామంది ఈ సమావేశంలో ప్రసంగించి సంస్థ పురోగతికి పలు సూచనలు తెలియజేయడం జరిగింది.

## దేవీ నవరాత్రుల సందర్భంగాఅంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



పులివెందులకదిలించే వార్త/ సెప్టెంబర్ 21: పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పురస్కరించుకుని ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ మాట్లాడుతూ నేటి నుండి దేవి శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే నేపథ్యంలో కావలసిన ఏర్పాట్లు సర్వం సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. అంకాలమ్మ తల్లిని దర్శించుకునేందుకుప్రతి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు, నైవేద్యాలు, సమర్పించి మొక్కులు చెల్లించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలపాలి

### ఏ పి సి సి రథసారథి వై. యస్.షర్మిల రెడ్డిని కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి



పులివెందుల **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** హైదరాబాద్ లోటస్ పాండ్ లో ఏ పి సి సి రథసారథి వై. యస్.షర్మిల రెడ్డిని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి కలిశారు. పులివెందులలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పని చేయాలని పిసిసి ఛీఫ్ షర్మిలా రెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్ లోని లోటస్ ఫండ్ లో ఉన్న పిసిసి ఛీఫ్ షర్మిలా రెడ్డిని ధ్రువ కుమార్ రెడ్డి కలిసి పులివెందుల సమస్యలపై, కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై ధ్రువకుమార్ రెడ్డితో షర్మిలా రెడ్డి చర్చించారు. కూటమి ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని చెప్పారు. మరింత గట్టిగా పోరాటం చేసి కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు అకర్షణ అయ్యే విధంగా ప్రజల పక్షాన నిలపడి సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని అన్నారు. ప్రస్తుతం ప్రజా సమస్యలపై చేసే పోరాటం మరింతగా ఉధృతం కాంగ్రెస్ పార్టీ తరపున చేయాలని సూచించారు. ఎఐసిసి పిలుపు మేరకు ఓట్ చోరీ కార్యక్రమానికి సంబంధించి పులివెందుల నియోజకవర్గంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టాలని కోరారు. రాహుల్ గాంధీకి మద్దతుగా ఓట్ చోరీ కార్యక్రమం జిల్లాలో కూడ జరిగే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారందరిని కలుపుకొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.

## అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకుపోయిన ఫలితం శూన్యం

### మరమ్మతులకు నోచుకోని రోడ్డు

### క్రాస్ రోడ్డు ఆర్చి వద్ద ఆటో బోల్తా

### సంఘటనలో ఎటువంటి ప్రమాదం జరగలేదు.



కమలాపురం**కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని క్రాస్ రోడ్డు దగ్గర ఆటో బోల్తా సంఘటన చోటుచేసుకుంది ఆదివారం మధ్యాహ్నం కడప నుంచి వస్తున్న ఆటో కమలాపురం ఆర్చి వద్ద గుంతలనంతో ఆటో బోల్తా పడింది .ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే చాలా రోజుల నుండి రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు క్రాస్ రోడ్డు నుంచి కమలాపురం వచ్చే దారిలో ఆర్చి వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడాయి అందులో వర్షాలు రావడంతోనీరు నిలిచి గుంతలు కనిపించడంలేదు టూవీలర్లు పాదచారులు కింద పడిన సంఘటన కూడా చోటుచేసుకుంది నగర పంచాయతీలో లో ఉన్న. రోడ్డు మరమ్మత్తుల సమస్యను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకొని పోయిన ఫలితం మాత్రం శూన్యం. పొంతన లేని సమాధానాలు ఇస్తూ త్వరలో టెండర్లకు పిలుస్తున్నాం త్వరలో ప్యాచింగులు వేస్తాం గుంతలు అన్నింటిని పూడుస్తాం అని మూడు నెలల పాటు కాలయాపన చేసిన యంత్రాంగం. ప్రజలు తిరగబడితే గాని ఇలాంటి వాటికి సరైన సమాధానం దొరకదని స్థానికులు తెలిపారు . ఇప్పటికైనా జిల్లా ఉన్నతధికారులు చొరవ తీసుకొని కమలాపురం క్రాస్ రోడ్ వద్ద ఉన్న ఆర్చి వద్ద ఉన్న గతుకుల రోడ్డుకు మరమ్మత్తులు చేస్తే ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగవు అని ప్రజలు వాపోతున్నారు.

## కరోనా సమయంలో రద్దు చేసిన రైలు అన్నిటిని ఆపాలి

### లేకపోతే దశల వారి ఆందోళన

### మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సమటూరు ప్రసాద్ రెడ్డి



కమలాపురం**కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** కేవలం వెంకటాద్రి . గుంటూరు ఎక్స్ప్రెస్ మాత్రమే కమలాపురంలో ఆగుతున్నయని మిగిలిన రైలను కూడా ఆపేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలి లేకపోతే దశల వారి ఆందోళన చేపడతామని మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సమటూరు ప్రసాద్ రెడ్డి తెలిపారు ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్లో స్టేషన్ మాస్టర్ కు వినతి పత్రం వైసిపి నాయకులతో కలిసి అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కంటే ముందు రేణిగుంట్ల నుండి గుంటకల్ మీదుగా వెళ్లే ప్రతి రైలు కమలాపురంలో ఆగేవని వాటన్నిటినీ కరోనా పేరుతో రద్దు చేశారని వాటిని తక్షణం పునరుద్ధరించి కమలాపురంలో ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను డిమాండ్ చేశారు గత మూడు సంవత్సరాల క్రితం కమలాపురంలో పలు ఎక్స్ప్రెస్ రైలు ఆగేవని ఇప్పుడు కేవలం వెంకటాద్రి ఎక్స్ప్రెస్ గుంటూరు ఎక్స్ప్రెస్ ఈ రెండు ట్రైన్లు ఆగుతున్నాయని వీటితోపాటు హుబ్లీ ఎక్స్ప్రెస్ ప్యాసింజర్ నంద్యాల డెమో ఎక్స్ప్రెస్లు మాత్రమే కమలాపురం రైల్వే స్టేషన్ లో ఆగుతున్నట్లు ఆయన తెలిపారు కరోనా కంటే ముందు రాయలసీమ ఎక్స్ప్రెస్ ఎగ్మోర్ ఎక్స్ప్రెస్ చెన్నై వెళ్లే మెయిల్ ఎక్స్ప్రెస్ ముంబై దాదర్ తిరుమల ఎక్స్ప్రెస్ రైలు కన్యాకుమారి ఎక్స్ప్రెస్ తదితర రైళ్ళను కమలాపురం రైల్వే స్టేషన్ లో ఆగే ఉన్నారు కమలాపురం పరిసర ప్రాంతాల్లో



కమలాపురం మైదుకూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లోని అనేకమందికి ఈ రైల్వే స్టేషన్ సౌలభ్యంగా ఉన్న నేపథ్యంలో ఇక్కడ రైళ్లు ఆగకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు ఈ విషయమై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అనేకమార్లు కేంద్రమంత్రికి రైల్వే అధికారులకు వినతిపత్రం ఇచ్చారని కావున రైల్వే అధికారులు కమలాపురం రైల్వే స్టేషన్ లో అన్ని రైలు ఆగేవిధంగా చూడాలని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు .

## ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటా మెట్టు గోవింద్ రెడ్డి...



కనేకల్ న్యూస్ **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** వార్డ్ మెంబర్ చిక్కన్నను పరామర్శించిన మెట్టు గోవిందరెడ్డి.. ఈరోజు కనేకల్ మండలం అంబాపురం క్రాస్ వద్ద వార్డ్ మెంబర్ చిక్కన్న అతని భార్య శారదమ్మ బళ్లారికి వెళుతుండగా అకస్మాత్తుగా బైకు వచ్చి తగిలినది కిందకు పడి చిన్న ప్రమాదం జరిగినది ప్రమాదం జరిగిన వార్త విన్న వెంటనే రాయదుర్గం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త గౌరవనీయులు మెట్టు గోవింద రెడ్డి కనేకల్ ప్రభుత్వ.హాస్పిటల్ నందు పరామర్శించి వారి. ఆరోగ్య పరిస్థితి డాక్టర్ తో చిక్కన్న అతని భార్య శారదమ్మకు.ధైర్యం ఉండమని చెప్పడం జరిగింది ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చినారు ఈ కార్యక్రమంలో కనేకల్ మండలం వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మత్తులు చేయండి

### ఏఐ ఎస్ ఎఫ్ఏరియా కార్యదర్శి కోగటం షేక్ సాదిక్ డిమాండ్



కమలాపురం**కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మత్తులు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి కోగటం షేక్ సాదిక్ డిమాండ్ చేశారు ఆదివారం కమలాపురంనగర పంచాయతీ లోని గుంతలు పడ్డ రోడ్లను వారు పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీ కమలాపురం ముఖ ద్వారం నుండి రైల్వే గేటు సమీపము వరకు గుంతలు పడ్డ రోడ్లు సుమారు రెండు సంవత్సరాల నుంచి ఇలాగే ఉన్నాయని విద్యార్థులకు ప్రజల కు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు మరియు ప్రమాదాలకు గురిచేస్తున్నాయని ప్రజలు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న ఉన్నత స్థాయి అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని వారు మండిపడ్డారు, నగర పంచాయతీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తక్షణమే మరమ్మత్తులు ప్రారంభించాలని ఉన్నత స్థాయి అధికారులను వారుకోరారు లేని పక్షం లో పెద్ద ఎత్తున ఆందోళనలు ధర్నాలు చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమం లో( ఏ ఐ ఎస్ ఎఫ్ ) ఉప అధ్యక్షులు మణికంఠ రెడ్డి, సహాయ కార్యదర్శి రబ్బానీ, తిలక్, రిహన్, తదితరులు పాల్గొన్నారు

## దుర్గ కాలనీలో అంబరానంటిన బతుకమ్మ సంబరాలు.....



ఆత్మకూర్/ **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:**ఆదివారం రోజున బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా దుర్గ కాలనీలోని మహిళలు బతుకమ్మ సంబరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. రకరకాల పూలను కోసి తెచ్చి బతుకుమ్మ అని పూలను దైవంతో పూజించడమే బతుకమ్మ పండుగ అని అన్నారు. ప్రపంచంలోనే తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే బతుకమ్మ పండుగకు ప్రత్యేక గుర్తింపు ఉంది అని అన్నారు. జమ్మి చెట్టుకు పూజ చేసి, దుర్గాదేవిని ఆరాధిస్తూ, రకరకాల పూలతో చేసిన బతుకమ్మలను తొమ్మిది రోజులు నీటిలో నిమజ్జనం చేస్తారని అన్నారు. అనంతరం మహిళలు తీసుకొచ్చిన తంగేడు తామర బంతి మొదలగు పూలను ఒక దగ్గర చేర్చి కాలనీలో బతుకమ్మ పండుగ విశిష్టత గురించి వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వరూప, రజిత, కవిత, శ్రీలత, యమున, రాధిక, రేఖ, కళ్యాణి, రాధిక, శ్రీలత, మౌనిక, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులపై కమిటీ ఏర్పాటు చేయాలి

### సీమ శ్రీనివాస్ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రఅధ్యక్షులు




ఆత్మకూర్/ **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ బస్సు యాత్ర ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రానికి చేరుకుంది ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షులు ఎండి బాబు మియా( చిరు) ఆధ్వర్యంలో ఉద్యమకారులు బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి వారి స్థితిగతులపై రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఉద్యమకారులకు ఇంటి స్థలం ఉచిత బస్సు సౌకర్యం రైలు సౌకర్యం కల్పిస్తూ స్థానిక సంస్థ ఎన్నికలు కూడా ఉద్యమకారులకు అవకాశం కల్పించాలని సరియైన స్థానం కల్పిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటామని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ఉద్యమకారుల ఆదుకొని ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలలో ఉద్యమకారులకు 25% కేటాయించి ఉద్యమకారులు ఆదుకోవాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు పొడి శెట్టిగణేష్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇరుషడ్ల సదానందం ఆత్మకూరు మండల అధ్యక్షులు ఎండి బాబు మియా (చిరు )సీనియర్ నాయకులు రాయరాకుల రవీందర్ ఆత్మకూరు మాజీ ఎంపీపీ రజనీకర్ పసుల లక్ష్మీనారాయణ దామెర కుమారస్వామి తదితరులు అందరూ ఆత్మకూర్ దామెర రెండు మండలాల ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొని బస్సు యాత్ర విజయవంతం చేశారు.

## సేవాపక్షోత్సవం.. అనంతలో మెగా మెడికల్ క్యాంప్

### బిజెపి జిల్లా కార్యదర్శి డాక్టర్ పోగుల నాగేంద్ర, చిత్రాల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహణ




అనంతపురం, **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జయంతిని పురస్కరించుకొని, బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సేవా పక్షోత్సవాల భాగంగా అనంతపురం కమలానగర్‌లోని శ్రీ రాజ్యలక్ష్మి ఆశ్రమంలో ఉచిత రక్తపరీక్షలు, హోమియోపతి మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఆక్యుట్, క్రానిక్, పీడియాట్రిక్, గైనకాలజీ సంబంధిత వ్యాధులపై ఉచిత హోమియోపతి చికిత్సతో పాటు రక్తపరీక్షలు నిర్వహించారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు చిత్రాల రాజేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి డా. పోగుల నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథులుగా సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షులు మోరుసు వెంకట రామణ, శ్రీ రాజ్యలక్ష్మి ఆశ్రమం అధ్యక్షులు పరుచూరి సూర్యప్రకాశ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ కణంపల్లి చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు. వైద్య బృందంలో సీనియర్ హోమియోపతి నిపుణుడు డా. పోగుల కుమారయ్య, డా. భగ్యరమ్య, డా. మండల వంశీ కృష్ణ, డా. షాహినా అజ్మీ, శ్రీ దాసరి శ్రీనివాసులు (శ్రీనివాస డైగ్నోస్టిక్ సెంటర్)తదితరులు సేవలందించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు రత్నమయ్య, లలిత్ కుమార్, వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మీ దేవమ్మ, వైస్ ప్రెసిడెంట్ పామిశెట్టి నాగరాజు, జిల్లా కార్యదర్శులు కే. మల్లికా, చైతన్య ఆర్, నారాయణరెడ్డి, ఐటీ జిల్లా కన్వీనర్ భీమా, లక్ష్మణ్, ప్రదీప్, పవన్, ఓబిరెడ్డి, శివ, రొయల చంద్రకళ, సౌభాగ్య దుగ్గుబాటి, తేజా రెడ్డి, నిచ్చెన మెట్ల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో మహిళలు, సీనియర్ సిటిజన్లు సహా వందలాది మంది ప్రజలు పాల్గొని ఉచిత వైద్య సేవలను పొందారు.

KADILIMCHE VAARTHA Telugu daily
కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

## అనంతపురం నియోజకవర్గ

# అభివృద్ధికి తోడ్పాటునందించండి

**కలెక్టర్ ఓ.ఆనంద్ కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి**

**నూతన కలెక్టర్ తో ఎమ్మెల్యే మర్యాదపూర్వక భేటి**

**పలు అంశాలపై చర్చించుకున్న కలెక్టర్, ఎమ్మెల్యే దగ్గుపాటి**



అనంతపురం అర్బన్,**కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటునందించాలని నూతన కలెక్టర్ ఓ.ఆనంద్ కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నాలుగు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ గా వచ్చిన ఓ.ఆనంద్ ను ఎమ్మెల్యే దగ్గుపాటి మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ కు వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువతో ఘనంగా సత్కరించారు. జిల్లాకు ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. అనంతరం నగరంతో పాటు నాలుగు పంచాయతీల పరిధిలోని అంశాల గురించి చర్చించారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం కావడంతో ఇక్కడ సామాజిక, ఆర్థిక, వ్యాపార ఇతర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నడిమి వంక, మరువ వంకల ప్రొటెక్షన్ వాల్స్, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు వంటి వాటిని కలెక్టర్ కు వివరించారు. అలాగే ప్రస్తుతం డంపింగ్ యార్డ్ లో చెత్తను తొలగించే ప్రక్రియ గురించి కూడా మాట్లాడారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు మీ సహకారం కావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అందరం కలిసి జిల్లా కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు.

## 'విజిబుల్ పోలీసింగ్" తో ప్రజలకు భద్రతా భరోసా..





అన్నమయ్య జిల్లా, క్రైమ్, **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** జిల్లాలో ప్రజల భద్రత కోసం పోలీసులు చేపట్టిన "విజిబుల్ పోలీసింగ్" కార్యక్రమం మరింత బలోపేతం అవుతోంది. జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్, ఆదేశాల మేరకు, పోలీసులు రోజువారీగా వాహనాల తనిఖీలు, రాత్రి పహారాలు, చెక్ పోస్టుల వద్ద కఠిన తనిఖీలు నిర్వహిస్తున్నారు. గంజాయి, నిషేధిత వస్తువుల రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటూ అక్రమాలను అరికడుతున్నారు. మరోవైపు సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి. ప్రజలు "తెలియని లింకులు క్లిక్ చేయవద్దు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు" అని పోలీసులు సూచిస్తున్నారు. రోడ్డు భద్రతపై కూడా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరిగా వాడాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ కఠినంగా నిషేధించామని తెలిపారు. ఆటోలలో ఎక్కువ మంది ఎక్కించుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిబుల్ పోలీసింగ్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉంటూ, భద్రతకు భరోసా ఇస్తామని జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించండి అని పిలుపునిచ్చారు.

## జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.



శ్రీ సత్యసాయి జిల్లా, క్రైమ్, కదిలించే వార్త, సెప్టెంబర్ 21 : శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.

## జన్మదిన వేడుకలకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి






బుక్కపట్నం మండలం, కదిలించే వార్త, సెప్టెంబర్ 21 : బుక్కపట్నం మండలం మారాలకు చెందిన టీడీపీ నాయకుడు రమణారెడ్డి మనువడు కార్తికేయ జన్మదిన వేడుకలకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

# వారి ఎత్తిపోతలు సుజలమట!

తెలంగాణ, ఆంధ్రలోని ఒకే తరహా సాగునీటి ప్రాజెక్టుల పట్ల ఒక వర్గం మీడియా ద్వంద్వ వైఖరితో వ్యవహరించడం, సదరు మీడియాలో వెలువడే కథనాలు, వాటి ఉద్దేశం గురించి ప్రధానంగా ఇక్కడ మనం చెప్పుకోవాలి. ఎందుకంటే, తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతుల కండ్లకు గంతలు కట్టి, వాస్తవాలను వక్రీకరించి, ఇక్కడి అన్నదాతల ప్రయోజనాలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తూ, తెలంగాణ సాగు సదుగులిరిగేలా చేసింది, ఇప్పటికీ చేస్తున్నది ఈ పక్షపాతపూరిత కథనాలే.వాస్తవానికి గాలేరు-నగరి, హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకాలు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులే. కానీ, మీడియా వీటిని 'సుజల స్రవంతి' పథకాలని నొక్కిచెప్తూ, అవి మంచి పథకాలనే భావనను కలిగిస్తున్నది. భారీ ఎలక్ట్రిక్ మోటర్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, సొరంగాలు, లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలపై ఆధారపడటం ద్వారా ఈ రెండు పథకాలు లిఫ్ట్ ఆధారిత సాగునీటి ప్రాజెక్టులే తప్ప, గ్రావిటీ ద్వారా నడిచే ప్రాజెక్టులు ఏ మాత్రం కావని స్పష్టమవుతున్నది. ఇవి ఇంచుమించు కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులే.

తెలంగాణ పట్ల చారిత్రక అన్యాయాలు ఎన్నో ఉన్నాయి. గత 60 ఏండ్లలో ఏ పెద్ద ప్రాజెక్టూ గోదావరి, కృష్ణా నదులను సమర్థవంతంగా వాడుకోలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ అలుముకున్న 'నిందల' కథనాల వలె ఏపీలోని 'సుజల స్రవంతి' పథకాలపై కథనాలు, వార్తలు ప్రచురితం కాకపోవడంపై తెలంగాణ యువతలో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఈ ప్రాజెక్టుల విషయంలో ఆర్థికంగా సాధ్యాసాధ్యాలు, వ్యయం-ప్రయోజనాల విశ్లేషణ, విద్యుత్తు భారం, భూసేకరణ, డీపీఆర్‌లు, ముఖ్యంగా నదీ బేసిన్ల వెలుపల నీటి మళ్లింపులపై పత్రికలు, టీవీ ఛానళ్లలో చర్చలు ఎందుకు జరగడం లేదని వారు ఆలోచిస్తున్నారు. కృష్ణా, గోదావరి నీటిని కరువు పీడిత ప్రాంతాలకు మళ్లించడమనేది ప్రభుత్వం, పాలకుల దయకాదు, అది ఆధునిక భారతదేశంలో ప్రతి రైతు హక్కు. ఏపీలో సాగునీటి విజయాల గురించి ఉత్సవాలు జరుపుకోండి. ఎవరూ కాదనరు. కానీ, అదే సమయంలో సాగునీటి కోసం తెలంగాణ చేసే ప్రయత్నాలపై నిందలు వేయడం, ఆరోపణలు చేయడం, లేనిపోని అనుమానాలు వ్యక్తంచేయడం సరికాదు. రెండు రాష్ర్టాల మధ్య పక్షపాత ధోరణితో కూడిన ఈ కథనాలు- రాజకీయాలు, మీడియా సంస్థల్లో లోతుగా పాతుకుపోయిన ఆధిపత్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇలాంటి మీడియా సంస్థలు ఇప్పటికీ హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు సాగిస్తుండటం విచారకరం. దశాబ్దాలపాటు కష్టాలను అనుభవించిన తెలంగాణ రైతులు, యువత ఇప్పుడు ఆత్మవిశ్వాసంతో, పూర్తి స్పష్టతతో ఉన్నారు. పక్షపాతపూరిత మేధావులతో రాజీపడిన ప్రజాస్వామ్య నాలుగో స్తంభం, అంటే మీడియా పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'నీళ్లు, నిధులు, నియామకాలు' నినాదంగా సాగిన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ గ్రామీణ యువత నేడు తెలంగాణ అవసరాల కోసం గోదావరి, కృష్ణా నదీ జలాలను వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలను చాలా నిశితంగా గమనిస్తున్నది. వ్యవసాయం చేసేందుకు తమ తల్లిదండ్రులు పడిన కష్టాలను కండ్లారా చూసిన, సాగునీటి కోసం తమ తాతముత్తాతలు పడ్డ వ్యథలను విన్న నేటి యువతరం మదిలో పంటలు పండక అప్పుల ఊబిలో చిక్కుకొని వలసపోయిన విషాదకరమైన

**జ్ఞాపకాలు ఇంకా ఉన్నాయి.**

పొట్టకూటి కోసం తమ తల్లిదండ్రులు పట్టణాలకు వలసపోవడం, వృద్ధుల దగ్గర పిల్లలను వదిలివెళ్లడం, గ్రామాలు ఖాళీ అవడం లాంటి భయానక దృశ్యాలను వారు ఇంకా మర్చిపోలేదు. గోదావరి జలాలను వాడుకోవడంబీ గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణ నీటి వాటాలను

# జగన్ రెడ్డికి 11సీట్లు కూడా మిగలవు..ఎమ్మెల్యే దగ్గుపాటి

**33మందికి రూ.41.50లక్షల**

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**ఎన్టీఆర్ వైద్య సేవలపై వైసీపీ దుష్ప్రచారమన్న ఎమ్మెల్యే**

**విద్య, వైద్యం ఉచితంగా అందాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయం**

**మాజీ ఎమ్మెల్యే అనంత 40ఏళ్లలో**

**జిల్లాకు ఏం చేశారని నిలదీత**



అనంతపురం అర్బన్, **కదిలించే వార్త/ సెప్టెంబర్ 21:** ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ ప్రజల్ని భయాందోళనకు గురిచేస్తున్న జగన్ రెడ్డికి.. వచ్చే ఎన్నికల్లో ఆ 11 స్థానాలు కూడా ఉండవని.. అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 17వ విడత కింద మొత్తం 33 మంది లబ్ధిదారులకు 41లక్షల 50వేల రూపాయల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే దగ్గుపాటికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ...ఒక్క అనంతపురం నియోజకవర్గానికే ముఖ్యమంత్రి చంద్రబాబు గడిచిన 15 నెలల్లో మూడు కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ కింద సాయం చేసినట్లు చెప్పారు. అదే గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా సాయం అందించలేదన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు కూడా 3500 కోట్ల రూపాయలు పెట్టి పోయారని విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాకనే ఆ బకాయిలన్నీ చెల్లించి ఎన్టీఆర్ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలను ఇన్సూరెన్స్ కింద తీసుకొచ్చి.. పేదలకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తుంటే దీనిపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. అసలు ఆరోగ్యశ్రీని ప్రైవేటు పరం చేస్తున్నారన్న ప్రచారాన్ని కూడా మొదలుపెట్టారన్నారు. కేవలం ఒక కార్డు తీసుకెళ్తే కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. జ్వరం దగ్గర నుంచి పెద్ద ఆపరేషన్ల వరకు అన్నీ ఉచితంగా అందించేలా ప్రభుత్వం చూస్తోందన్నారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో కీలకమైన మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. పేదలందరికీ ఉచితంగా విద్య అందేలా కృషి చేస్తున్నారన్నారు. విద్య, వైద్యం రెండు పూర్తిగా ఉచితంగా అందించాలన్నదే తమ ప్రభుత్వం ఉద్దేశ్యం అన్నారు. జగన్ రెడ్డి గతంలో 17 మెడికల్ కళాశాలలు తీసుకొచ్చారని.. గొప్పలు చెప్పుకుంటున్నారు.. కానీ అందులో ఎన్ని నిర్మించారో సమాధానం చెప్పాలన్నారు. మెడికల్ కళాశాల సీట్లను 20 లక్షలకు అమ్ముకున్న చరిత్ర జగన్ రెడ్డిది అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకొచ్చిన 400 కోట్లలో అవినీతికి పాల్పడ్డారన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి 40ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారని.. ఆయన జిల్లాకు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే హంద్రీనీవా కాలువ వెడల్పు చేసినట్లు తెలిపారు. 1800 క్యూసెక్కుల నుంచి 3800 క్యూసెక్కుల వరకు కాలువ వెడల్పు చేసి 475 చెరువులకు నింపుతూ.. కుప్పం వరకు నీరు తీసుకెళ్లారన్నారు. ఓవైపు వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ.. ఇంకోవైపు అనేక కంపెనీలను అనంతపురం జిల్లాకు తీసుకొస్తుంటే.. అది చూసి ఓర్వలేక.. వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. వారి నాయకుడు తరహాలోనే ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందుకే వీరికి వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా ఉండవన్నారు. పులివెందుల జడ్పిటిసిని కూడా గెలవలేకపోయిన జగన్ కు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు కూడా ఉండదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు లలిత్ కుమార్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సైఫుదిన్, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, టిడిపి నాయకులు గోళ్ళ సుధాకర్ నాయుడు, రఘు, మున్వర్, సరిపూటి శ్రీకాంత్, రూపనగుడి రవి రాయల్, ఇమ్రాన్, బిల్లర్ రాము, %అఎవి% నారాయణస్వామి టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మనో వికాసానికి




బాల సాహిత్యమే పునాదిమానవ జీవితానికి బాల్యం ఆధారభూతమైన దశ. ఈదశలో పిల్లల మనస్సు ఆకర్షణకు లోనవుతుంది, ఊహలకుగొప్ప స్థావరంగా ఉంటుంది. అలాంటి దశలో వారు చదివే, వినే, చూసే, అనుభవించే అంశాలే భవిష్యత్తు కాలంలో వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. పిల్లలు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదగాలంటే ప్రేమ, ఆహారం, స్వచ్ఛమైన గాలి, ఆటలు ఎంత అవసరమో కళలు, కథలు, కవితలు, సంగీతం కూడా అంతే అవసరం. బాలసాహిత్యం అనేది పిల్లల కోసం రాసేది. అలా రాసిన బాల సాహిత్యం పిల్లల్లో తమదైన ఊహాశక్తి, జ్ఞానం, నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కథలు, కవితలు, నాటికలు, జానపద గాథలు, ఇతర రూపాల్లో లభించే బాల సాహిత్యం పిల్లల మానసిక, భావోద్వేగ, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుంది. నిజానికి బాల సాహిత్యం ఎదుగుతున్న పిల్లల జీవితాల్లో ఒక అమూల్యమైన సంపద. ఇది వారి మనసును ఆకర్షిస్తూ, విజ్ఞానాన్ని అందిస్తూ, నైతిక విలువలను నేర్పిస్తుంది. భవిష్యత్ సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి బాల సాహిత్యం ఎంతో ముఖ్యమైనది. పిల్లలను ఉత్తమ తరంగా, పౌర సమాజంగా సంసిద్ధం చేయడానికి బాల సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనం. దీన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా మనం పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చు. బాల సాహిత్యం చదువడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి రెక్కలు కట్టుకొని ఎగురుతుంది. మాయాజాల కథలు, సాహస గాథలు వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఇవి వారి సృజనాత్మక ఆలోచనలను పెంచి, సమస్యలను వినూత్నంగా పరిష్కరించే సామర్థ్యాన్ని అందిస్తాయి.

బాల సాహిత్యం వివిధ రూపాల్లో ఉంటుంది. వాటిద్వారా వారిలో భాషా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. సరళమైన, ఆకర్షణీయమైన శైలిలో రాసిన కథలు, కవితలు వారి పఠన, రచన, శ్రవణ సామర్థ్యాలను మెరుగుపరుస్తాయి. బాలసాహిత్యం పిల్లలకు సత్యం, ధర్మం, సహానుభూతి, సహకారం వంటి నైతిక విలువలను కూడా నేర్పుతుందనే చెప్పవచ్చు. అలనాటి పంచతంత్రం, ఈసప్ కథలు వంటివి నీతి బోధనల ద్వారా పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. వేమన, సుమతి పద్యాలు వాళ్లలో సృజనాత్మకతకు పాదులు వేస్తాయి. అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు చెప్పే కథలు, జానపద కథలు పాటల ద్వారా పిల్లలు తమ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకుంటారు. ఇది వారిలో సాంస్కృతిక గౌరవాన్ని, గుర్తింపును కలిగిస్తుంది. బాలలు కథలు, కవితలు, పాటలు చదువడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, ఓర్పు, పట్టుదల వంటి గుణాలు పెరుగుతాయి. బాల సాహిత్యం పిల్లల్లో సానుకూల వ్యక్తిత్వ లక్షణాలను రూపొందిస్తుంది. సమూహ కథలు, స్నేహగాథలు పిల్లలకు సహకారం, జట్టు కృషి, టీం స్పిరిట్ పక్కవారి భావాలను గౌరవించడం లాంటి అంశాలను నేర్పుతాయి. అంతేకాదు, సైన్స్ విజ్ఞాన సంబంధిత కథలు, కవితలు శాస్త్రీయ పిల్లల్లో జ్ఞానాభిరుచిని పెంచుతాయి. కథల ద్వారా పిల్లలు వివిధ భావోద్వేగాలను అర్థం చేసుకుంటారు. దుఃఖం, సంతోషం, భయం వంటి భావాలను నియంత్రించడం నేర్చుకుంటారు. బాల సాహిత్యం పిల్లలకు వినోదాన్ని అందిస్తూనే ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది వారి మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది.

ఇట్లా బాలల గురించి బాలల సాహిత్యం సినిమాలు సాంస్కృతిక రంగం గురించి చాలా మాట్లాడతాం. కానీ, మన దేశంలో పిల్లల కోసం చేస్తున్నదేమిటి? ఎంత? అని ఆలోచిస్తే జరుగుతున్నది చాలా స్వల్పమనే చెప్పాలి. ముఖ్యంగా పిల్లల సృజనాత్మక రంగంలో జరుగుతున్న కృషి చాలా తక్కువ. మలయాళం, బెంగాలీ, కన్నడ, కొంత మరాఠీ భాషల్లో మాత్రం ఎన్నదగిన కృషి జరుగుతున్నది. తెలుగులో బాల సాహిత్యం విరివిగానే వస్తున్నప్పటికీ ఇంకా నాణ్యమైన రచనలు రావాల్సి ఉన్నది. మరోవైపు బాల సాహిత్యకారులను ద్వితీయస్థాయి సృజనకారులుగా కాకుండా వారికి ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వాల్సి ఉన్నది. సాహిత్య విషయాలు ఇట్లా ఉంటే సిన్మా సంగతి మరింత దారుణం. పిల్లల కోసం ప్రత్యేకంగా తీసిన వందల బాలల సినిమాలు ముంబై చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ గోదాముల్లో స్తబ్ధంగా పడి ఉన్నాయి. ఇక మన హైదరాబాద్‌లో జరగాల్సిన అంతర్జాతీయ స్థాయి పిల్లల సినిమాల పండుగకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తిలోదకాలిచ్చేశాయి. ఈ స్థితిలో బాల సాహిత్యకారులు మరో అంశాన్ని గమనించాల్సి ఉన్నది. ఇవ్వాళ ప్రాథమికోన్నత విద్యాసంస్థలన్నీ ఇంగ్లీష్ మాధ్యమానికే మొగ్గు చూపుతున్నాయి. భవిష్యత్తులో ఉద్యోగాల కోసమైనా, మరి దేనికోసమైనా ఇంగ్లీష్ తప్పనిసరి అనే వాదంతో తెలుగు బోధన అపురూపమైపోయిందనే చెప్పాలి. ఇక ఐటీ తదితర రంగాల్లో ఉన్నవాళ్లకు తెలుగు చదువడమే గగనమైపోయింది. అందుకే బాలసాహిత్య సృజనకర్తలు కేవలం తెలుగులోనే రాసి ఊరుకోకుండా వాటికి ఆంగ్లానువాదాలను కూడా జతచేసి ప్రచురించగలిగితే ఈ రోజుల్లోని ఇంగ్లీష్ మీడియం స్కూళ్లల్లో వాటికి సముచితమైన స్థానం లభిస్తుంది.

టీవీల్లో, ఇంటర్నెట్‌లో ఇంగ్లీషుకే అలవాటు పడిపోతున్న బాలలకు ద్విభాషా పుస్తకాలు ఎంతో మేలు చేస్తాయి. ఈ దిశలో పెద్దపల్లి లాంటి ఒక మారుమూల ప్రాంతంలో జరిగిన ఒక ప్రయత్నాన్ని అందరి దృష్టికి తేవాలని ఉన్నది. పుల్లూరి జగదీశ్వర్‌రావు అనే బాల సాహిత్యవేత్త 'లిటిల్స్' అనే ఒక కథల పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో రాసి ప్రచురించారు ఆయన ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. విద్యాధికుడైన ఆయన పలు పత్రికల్లో కూడా వ్యాసాలు రాస్తారు. 'ఎడారి మొక్కలు' కథతో మొదలయ్యే ఈ కథా సంకలనంలో 24 కథలున్నాయి. అలతి అలతి మాటల్లో జీవకారుణ్యం, పర్యావరణం, జీవ వైవిధ్యం, కాలుష్యం వంటి అనేక అంశాలను కథలుగా ద్విభాషల్లో గుదిగుచ్చారు. ఈ కథలను చదివి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఆకర్షితుడై 150 పేజీల 'లిటిల్స్' పుస్తకాన్ని తానే ముద్రించి పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేయించారు. కలెక్టర్ శ్రీహర్ష రాసిన ముందుమాటలో 'పాఠశాల విద్యను అభ్యసిస్తున్న కాలం బాలబాలికలకు అత్యంత ముఖ్యమైన కాలం. వాళ్లు వ్యక్తులుగా రూపొందే క్రమం అక్కడే మొదలవుతుంది' అన్నారు. అది ముమ్మాటికీ నిజం. పుల్లూరి జగదీశ్వర్‌రావు వలె పిల్లల కోసం ద్విభాషా కథలు, కవితలు రాయడం, కలెక్టర్ శ్రీహర్ష లాగా ప్రోత్సహించి స్కూలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్రమంతటా, అన్ని జిల్లాల్లోనూ జరగాల్సి ఉన్నది. అట్లయితేనే అర్థవంతమైన బాల సాహిత్యం అందుబాటులోకి వస్తుంది.

# అకస్మాత్తుగా కుంటుతున్నాడు..



మా బాబు వయసు మూడు సంవత్సరాలు. హుషారుగానే ఆడుకుంటాడు. ఇంతకుముందు ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేవు. అందరిలానే పరుగెత్తుతాడు, మాట్లాడతాడు. కానీ, వారం రోజులుగా తన నడకలో మార్పు కనిపిస్తున్నది. ఎందుకో కుంటుతున్నాడు. డాక్టర్‌కి చూపిస్తే.. నొప్పి ఉందని, కొన్ని నొప్పి తగ్గించే మందులు ఇచ్చారు. అవి వాడినా తగ్గలేదు. ఇప్పుడు ఏ వైద్యుడిని సంప్రదించాలి? మూడు సంవత్సరాల వయసు పిల్లలు చాలా హుషారుగా ఉంటారు. బాగా గెంతుతూ ఉంటారు. కుంటిగా నడవడం, నడకలో తేడా వచ్చిందంటే లోపల ఏదో సమస్య ఉండే ఉంటుంది. మీరు ఇప్పటికే వైద్యులకు చూపించామని చెబుతున్నారు. కానీ, ఏ డాక్టర్ అన్నది వివరించలేదు. పిల్లల వైద్యులతో తప్పని సరిగా చికిత్స చేయించాలి. ఎటువంటి గాయం లేకుండా, దెబ్బ కనిపించకుండా ఉన్నా.. పెద్దలు చూడనప్పుడు కిందపడి గాయపడవచ్చు. అవి కనిపించకపోవచ్చు. అందువల్ల నొప్పి, నడకలో మార్పు వస్తుంది. అలాంటి నొప్పి రెండు, మూడు రోజుల్లో సాధారణంగా తగ్గిపోవాలి. కొన్నిసార్లు జాయింట్స్ (కీళ్ల)లో, ఎముకలో, కండరాల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నా నొప్పి కలగడం, నడకలో మార్పు రావడానికి ఆస్కారం ఉంటుంది. ఆ ఇన్‌ఫెక్షన్ ఉంటే జ్వరం వస్తుంది. బిడ్డ హుషారుగా ఉండకపోవడం, రోజూ ఆడినట్టుగా ఆడకపోవడం జరుగుతుంది. కొన్నిసార్లు వారం, రెండు వారాలపాటు ఇన్‌ఫెక్షన్ ఉంటే కీళ్లలో నీరు చేరుతుంది. తుంటి ఎముక కీళ్లలో ఎక్కువగా ఈ సమస్య వస్తుంది. ఈ ఇబ్బంది దానికదే తగ్గిపోతుంది. కొద్దిగా నొప్పి, కుంటుతూ నడవడం కనిపిస్తాయి. ఏది ఏమైనా, పిల్లల డాక్టర్, కుదిరితే పిల్లల ఎముకల డాక్టర్‌కి చూపిస్తే మంచిది. అవసరమైన ఎక్స్‌రే, స్కాన్, రక్తపరీక్షలు చేయించాలి. ఆ తర్వాత వైద్యుల సలహాలు పాటించాలి.

## భారత్, చైనాపై 100 శాతం సుంకాలు

# విధించాలని ఈయూను కోరిన ట్రంప్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , చైనా విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఓ వైపు భారత్ మిత్ర దేశం అంటూనే 50 శాతం సుంకాలు విధిస్తున్నారు. అంతటితో ఆగకుండా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై 100 శాతం సుంకాలు విధించాలని యూరోపియన్ యూనియన్ ను కోరినట్లు తెలుస్తోంది. ఈ చర్య ద్వారా ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని చూస్తున్నారు. వాషింగ్టన్‌లో అమెరికా, ఈయూ అధికారుల సమావేశంలో ట్రంప్ ఈ అభ్యర్థన చేశారని ఫైనాన్షియల్ టైమ్స్ తెలిపింది. ఈయూ ఈ రెండు దేశాలపై సుంకాలు విధిస్తే, అమెరికా కూడా అదే స్థాయిలో సుంకాలు విధించడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ విషయంపై వైట్ హౌస్ ఇంకా స్పందించలేదు. ఇప్పటికే అమెరికా, భారత్ నుంచి వచ్చే దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించింది. దీంతో మొత్తం సుంకాలు 50 శాతం వరకు పెరిగాయి. ఈ సుంకాలను అన్యాయం, అసమంజసం అని భారత్ విమర్శించింది. అమెరికా, ఈయూ కూడా రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తుందని భారత్ తెలిపింది. 2024లో ఈయూ-రష్యా వాణిజ్యం 67.5 బిలియన్ యూరోలు (సుమారు 78.1 బిలియన్ డాలర్లు), 2023లో సేవల వాణిజ్యం 17.2 బిలియన్ యూరోలుగా ఉందని యూరోపియన్ కమిషన్ డేటా చెబుతోంది. మాస్కోలో భారత రాయబార కార్యాలయం డేటా ప్రకారం, 2025 మార్చితో ముగిసిన ఏడాదిలో భారత్-రష్యా ద్వైపాక్షిక వాణిజ్యం 68.7 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది ప్రీ-పాండమిక్ వాణిజ్యం (10.1 బిలియన్ డాలర్లు) కంటే దాదాపు 5.8 రెట్లు ఎక్కువ. రష్యా చమురు ఎగుమతుల్లో అతిపెద్ద కొనుగోలుదారు చైనా. కానీ చైనా 30 శాతం సుంకాలతో తప్పించుకుంది. ఇది వాషింగ్టన్‌తో ఒప్పందం ద్వారా సాధ్యమైంది. ట్రంప్ ఈ ప్రతిపాదన వెనుక ఉద్దేశం, ఉక్రెయిన్ యుద్ధాన్ని (%=బంంఋ ఖనేతీఋఆఅవ ఔతీ%) ముగించేందుకు రష్యాపై ఆర్థిక ఒత్తిడి పెంచడం. గత నెలలో అలాస్కాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ట్రంప్ సమావేశం జరిగినప్పటికీ, కాల్పుల విరమణకు సంబంధించి పెద్దగా పురోగతి రాలేదు. ఆ సమావేశం తర్వాత, పుతిన్ శాంతి కోసం సమస్యల మూల కారణాలను పరిష్కరించాలని అన్నారు. ట్రంప్ కూడా కొన్ని విషయాలపై ఒప్పందం కుదిరినప్పటికీ, పెద్ద అంశాల్లో పురోగతి సాధించలేదన్నారు. మరోవైపు ట్రంప్ మంగళవారం రాత్రి %శ% పోస్ట్‌లో భారత్‌తో వాణిజ్య చర్చలు తిరిగి ప్రారంభమయ్యాయని, వాణిజ్య అడ్డంకులను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. మోదీని చాలా మంచి స్నేహితుడు అని పిలిచిన ఆయన, ఈ చర్చలు విజయవంతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు భారత్, చైనాలకు ఒక సవాలుగా మారాయని చెప్పవచ్చు.

# బంగారం భగ్గు

**సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి ధర**

**%ఢిల్లీలో 10 గ్రాములు రూ.1,12,750కి చేరిక**

**ఒక్కరోజే రూ.5,080 పెరుగుదల**

**ఈ ఏడాదిలో రూ.33,800 అప్**




న్యూఢిల్లీ: పసిడి చుక్కలనంటుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ దీని ధర సరికొత్త శిఖరాలకు దూసుకెళ్లింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మంగళవారం రూ.5,080 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.1,12,750కి ఎగబాకింది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ ప్రకారం.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు గోల్డ్ రేటు రూ.33,800 (దాదాపు 43 శాతం) పెరిగింది. గత ఏడాది డిసెంబరు 31న ఢిల్లీలో 10 గ్రాముల పసిడి రేటు రూ.78,950గా నమోదైంది. వెండిదీ గోల్డెన్ ట్రెండే.. కిలో రేటు రూ.2,800 పెరుగుదలతో రూ.1,28,800కు చేరింది. ఇంటర్నేషనల్ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ మరో 16.81 డాలర్లు ఎగబాకి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 3,659.27 డాలర్లకు పెరిగింది. సిల్వర్ 41.50 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. గత నెలలో అమెరికా కార్మిక శాఖ విడుదల చేసిన ఆగస్టు ఉద్యోగ నియామకాల గణాంకాలు బలహీనంగా ఉండటంతో పాటు గతంలో విడుదల చేసిన మే, జూన్ గణాంకాలను సైతం దిగువకు సవరించడంతో వచ్చేవారం ఫెడ్ రేట్లు మరింత తగ్గించవచ్చన్న అంచనాలు ఊపందుకున్నాయి. ఇది బులియన్ ర్యాలీకి ప్రధాన కారణం. తాజా ఉద్యోగ గణాంకాలు అమెరికా ఆర్థిక పరిస్థితిపైనా కొత్త సందేహాలు లేవనెత్తుతున్నాయి. ట్రంప్ టారిఫలతో అంతర్జాతీయంగా వాణిజ్య అవరోధాలు కూడా పెరిగాయి. దాంతో ఇన్వెస్టర్లు ఆర్థిక అనిశ్చితుల్లో భద్రత కల్పించే బంగారంలోకి తమ పెట్టుబడులను మళ్లిస్తున్నారని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఏడాది చివరినాటికి 4,000 డాలర్లకు?

ఔన్స్ పసిడి ఈ వారంలోనే 3,700 డాలర్లకు ఎగబాకవచ్చన్న అంచనాలున్నాయి. మాంద్యం ముప్పును ఎదుర్కొంటున్న అమెరికా ఆర్థిక వ్యవస్థకు మద్దతిచ్చేందుకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను వేగంగా తగ్గించాల్సి వస్తే, ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ బంగారం 4,000 డాలర్లు దాటే అవకాశాల్లేకపోలేవని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏడాదికాలంలో వెండి

రూ.1.50 లక్షలు

వచ్చే ఏడాది కాలంలో కిలో వెండి ధర రూ.1.50 లక్షలకు చేరుకోవచ్చని, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) సిల్వర్ 50 డాలర్లకు ఎగబాకనుందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నివేదిక అంచనా వేసింది. పారిశ్రామిక రంగంలో వెండి వినియోగం గణనీయంగా పెరుగుతుండటం, బలహీనపడుతున్న డాలర్, మరింత తగ్గనున్న ఫెడ్ రేట్లు, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు అన్నీ వెరసి ఈ విలువ లోహం ధరలను ఎగదోయనున్నాయని రిపోర్టు పేర్కొంది. మోతీలాల్ ఓస్వాల్ భావిస్తోంది. మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సిల్వర్ ధర ఈ ఏడాదిలో ఇప్పటివరకు 37 శాతం పెరిగింది.

# విటమిన్ డి లోపంతో ఎన్నో ఆరోగ్య సమస్యలు?

కండరాల నొప్పులు, తీవ్రమైన అలసట, తరచూ ఇన్ఫెక్షన్లు సోకడం, జుట్టు ఊడిపోవడం లాంటివి విటమిన్ డి లోపం వల్ల కనిపించే లక్షణాలని నిపుణులు చెబుతున్నారు. దేశంలో దాదాపు 90 శాతం మహిళలకు డి- విటమిన్ లోపం ఉన్నట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ క్రమంలో విటమిన్ డి వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయి, వాటిని ఎలా అధిగమించాలో ఇప్పుడు తెలుసుకుందాం! ప్రస్తుతం ఎక్కువ మంది ఉద్యోగ రీత్యా నీడపట్టునే ఉండటం, బయటకు వెళ్లాల్సి వచ్చినా చర్మం నల్లబడుతుందేమోనని మాస్క్?లూ, స్కార్ఫ్?లతో శరీరాన్ని పూర్తిగా కప్పేస్తున్నారు. దీంతో చర్మానికి నేరుగా సూర్యకాంతి తగలడపోవడంతో విటమిన్ డి లోపానికి ప్రధాన కారణమవుతుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాన్నే తీసుకుంటూ చేపలు, గుడ్లు, ఫోర్టిఫైడ్ ఫుడ్స్ వంటివి తక్కువగా తీసుకోవడం మరో కారణంగా చెబుతున్నారు. సమస్యలెన్నో!: ప్రస్తుతం బిజీ షెడ్యూళ్లు, ఒత్తిళ్ల మధ్య ఆరోగ్యం గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. కానీ, విటమిన్ లోపంలో అన్ని భాగాలూ క్రమేణా బలహీనమవుతాయని నిపుణులు చెబుతున్నారు. పిల్లలలో విటమిన్ డి లోపం తీవ్రంగా ఉంటే రికెట్స్ వ్యాధి వస్తుందని, పెద్దవారిలో అయితే అలసట, ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో పాటు మానసిక స్థితిలో మార్పులు వస్తాయని %ఎశ్రీవజవశ్రీఖఅఎఎశ్రీఅఅఅఎ% అధ్యయనంలో పేర్కొంది. అందుకే రోజూ కాసేపైనా సూర్యరశ్మిలో గడపడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఆనందంగానూ అనిపిస్తుందని పేర్కొంటున్నారు.

‘కిడ్నీలకు’ ముప్పు తెచ్చే అలవాట్లు ఇవే! - నిపుణులు ఏమంటున్నారంటే!

దీన్ని అధిగమించేదెలా?: శరీరానికి అవసరమైన విటమిన్ డి ఎక్కువగా సూర్యకాంతి నుంచే లభిస్తుందని అందరికి తెలిసిన విషయమే! సూర్యకాంతి వల్ల చర్మం పై పొర 7-డీ హైడ్రోకొలెస్ట్రాల్ అనే అణువును ఉత్పత్తి చేస్తుందని, ఇది సూర్యకాంతి నుంచి వచ్చే యూవీ కాంతి సాయంతో విటమిన్ డి3ని తయారుచేస్తుందని వివరించారు. దీన్ని లివర్, కిడ్నీ విటమిన్? డిగా మార్చి శరీరానికి అందిస్తాయంటున్నారు. విటమిన్ డి శరీరం ఆహారం నుంచి కాల్షియం, భాస్వరం గ్రహించడానికి, ఎముకల అభివృద్ధికి సహాయపడుతుందని %జణజ% అధ్యయనంలో పేర్కొంది.

# ఉప్పుటుండలు, ఉప్పిట్టు

## “...సారువలు నుప్పుటుండల మేరువులును”

శ్రీరంగమాహాత్మ్యంలో భైరవకవి ఘూటైన మిరియాల చారుని, మేరుపర్వతంలా పేర్చిన ఉప్పుటుండల్ని పేర్కొన్నాడు. నిఘంటువులు, వ్యాఖ్యాతలు ఉప్పుటుండల్ని ఒక పిండి వంట, ఒక తినే పదార్థం అని మాత్రమే రాశారు. కన్నడం వారికి ‘ఉప్పిట్టు’ తెలుగువాళ్ళకు ఉప్పిండి ప్రాచీన వంటకాలు. డి.ఇ.డి.ఆర్. నిఘంటువులో తమిళ ‘ఉవి’ అంటే, ఉడికించటం, ఉవియల్ = ఉడికించిన వంటకం, ఉవళం = ఉడికించిన బియ్యం అని అర్థాలు. తెలుగులో దీన్ని ‘ఉప్పు’ అని పిలుస్తాం. ఉప్పంటే లవణం అనే కాదు, ఉడికించిందనే అర్థం కూడా ఉంది. ఉప్పరి = ఉడికించినదని! ఉడికించి ఆరబోసిన వడ్ల లోంచి వచ్చిన బియ్యం ఉప్పుడు బియ్యం, వాటి రవ్వ ఉప్పుడురవ్వ. ఈ రవ్వను ఉడికించి తాలింపు పెట్టినది ఉప్పిండి లేదా ఉప్పిడి. ఇప్పటి ఉప్మా పూర్వరూపం ఇది! రాత్రిపూట ఈ ఉప్పిడిని మాత్రమే తిని సరి పెట్టుకోవటాన్ని ఉప్పిడి ఉపవాసం అనే వాళ్లు. ఈ ఉప్పిడిని ఉప్పు వెయ్యకుండా కొద్దిగా తీపి కలిపి కూడా చేసుకునే వాళ్లు. బొంబాయిరవ్వ ఉప్మాలో పంచదార కలుపుకుని పిల్లలు ఇష్టంగా తింటారు ఇప్పటికీ! ఇలా ఉప్పు లేని ఉప్మాని ‘ఉప్పిడి’ అనటం అలవాటయ్యింది. “... వ్రతములు చేసి పెక్కుచి లుపవాసములున్ మఱి పెక్కు లుప్పిఁడుల్, ధృతి నొనరించి...” అని తెనాలి రామకృష్ణుడు ఉద్భటారాధ్యచరితంలో ఉప్పు, కారము, పులుసు లేకుండా ఈ ఉప్పిడిని మాత్రమే తిని ఉండే పస్తు అనే అర్థంలో ‘ఉప్పిడులు’ అన్నాడు. “ఓర్పుమై నుప్పిండి యుపవాస ముండనీ మగనాలి సరిపోల్పం దగదు విధవ” అంటూ కాశీఖండంలో శ్రీనాథుడు శరీర వాంఛలన్నీ చంపుకొని, ఉప్పిడి ఉపవాసం చేసే విధవలకుగల అమితమైన ఓర్పుని ప్రశంసించాడు. దీన్నిబట్టి, స్థూలకాయం తగ్గేందుకు డైటింగ్ చేసేవారికి ఇది బాగా ఉపయోగ పడవచ్చునని అర్థం అవుతోంది. బియ్యాన్ని ఉడికించి ఎండిస్తే అందులోఈస్ట్ ఏర్పడి కొద్దిగా పులుస్తాయి. హాఫ్ బాయిల్డ్‌రైస్ పేరుతో ఈ ఉప్పుడు బియ్యందొరుకుతున్నాయి. దోసెల బియ్యం అంటున్నారు వీటిని! మలయాళీలు ఈ బియ్యంతోనే అన్నం వండు కుంటారు. తింటూ ఉండగానే అరుగుదల ప్రారంభిస్తాయి! ఉప్పుడుబియ్యప్పిండిలో నెయ్యి, బెల్లం కలిపి ఉండలు కట్టుకొని తింటే రక్త మొలలు తగ్గుతాయి కూడా!

**ఉప్పుటుండలు ఇలా...**



ఉప్పుడు పిండితో నేరుగా ఉప్మా చేస్తే ఉప్పుడు వాసన వస్తుంది. అందుకని ఉప్పుడు రవ్వని నీళ్ళలో వేసి 5-6 గంటలు నానబెట్టి నీళ్లు వార్చేసి, ఆ రవ్వని ముద్దగా ఇడ్లీ ప్లేట్లో ఉంచి ఆవిరిమీద ఉడికించాలి.




చిదిపితే పొడి పొడిగా అవుతుంది. ఇందులో చాలినంత నెయ్యి, పొడిబెల్లం, కొబ్బరి తురుము, వేగించిన జీడిపప్పు వగైరా కలిపి ఉండలు కడతారు. ఇవే ఉప్పుటుండలు. ఉండలు కట్టకుండా ఉప్మా లాగా పొడిపొడిగా చేసుకుంటే దాన్ని ‘ఉప్పిట్టు’ అంటారు. కన్నడం వారు ‘పిట్టు’ పేరుతో దీన్ని ఇష్టంగా తింటారు. తీపికి బదులుగా ఉప్పు, పచ్చిమిరప ముక్కలు, అల్లం వగైరా కలిపి తాలింపు పెట్టుకుంటే అది ఉప్పుమావు. ఉప్మాగా మారింది. మౌలికంగా ఉప్మా అనేది ఉప్పుడు రవ్వకు సంబంధించిన వంటకం. బొంబాయి రవ్వ వాడకంలోకి వచ్చాక ఉప్మా తీరు మారింది! పూర్వం మామూలు బియ్యపు రవ్వ కష్టంగా అరుగుతుందని ఉప్పుడు రవ్వ తోనే ఉప్మా చేసుకునే వాళ్లు. కంది పప్పు, పెసరపప్పు కూడా చేరిస్తే మరింత బలకరం! రాగి, జొన్న, సజ్జ, ఆరికలు, కొర్రలు వీటిని కూడా ఉప్పుడు ప్రక్రియలోకి మారిస్తే మరింత ఆరోగ్యదాయకంగా ఉంటాయి.

**- డా. జి వి పూర్ణచందు, 94401 72642**

### బెంగాలీ కంచ్‌కోలర్ కోఫ్తా

కావలసిన పదార్థాలు: అరటి కాయలు-రెండు (ఉడికించి,ముద్దగా చేసినవి), ఆలుగడ్డలు-రెండు(ఉడికించి, ముద్దగా చేసినవి), టమాటా ప్యూరీ-అర కప్పు, కొబ్బరి తురుము-స్పూను, పసుపు-స్పూను, పచ్చిమిర్చి ముక్కలు-స్పూను, అల్లం ముక్కలు- పావుస్పూను, జీలకర్ర పొడి-అర స్పూను, ధనియాల పొడి-స్పూను, కారం-రెండు స్పూన్లు, జీలకర్ర- స్పూను, ధనియాలు-రెండు స్పూన్లు, తేజ్ పత్తా-ఒకటి, దాల్చిన చెక్క-చిన్నది, యాలకులు- రెండు, లవంగాలు-నాలుగు, కొత్తిమీర తరుగు-రెండు స్పూన్లు, చక్కెర-స్పూను, ఉప్పు, నూనె, నీళ్లు-తగినంత. తయారుచేసే విధానం: ఓ గిన్నెలో అరటి, ఆలూని తీసుకోవాలి. ఇందులో కారం, జీలకర్ర పొడి, ధనియాల పొడి, పసుపు, ఉప్పు వేసి కలపాలి. ఈ కోఫ్తా మిశ్రమాన్ని నిమ్మకాయ సైజు ముద్దలుగా చేసుకుని నూనెలో వేయించి పక్కనపెట్టుకోవాలి. ఓ ప్యాన్‌లో జీలకర్ర, ధనియాలు, దాల్చిన చెక్క, తేజ్‌పత్తా, లవంగాలు, యాలకులను వేయించి, చల్లారాక మిక్సీలో వేసి మసాలా పొడి చేయాలి. చిన్న గిన్నెలో పసుపు, ధనియాల పొడి, కారం, జీలకర్ర పొడి, అర కప్పు నీళ్లు కలిపి కారం మిశ్రమాన్ని చేసి పెట్టుకోవాలి. ప్యాన్‌లో కాస్త నూనె వేసి జీలకర్ర, ఎండు మిర్చి చిటపటలాడాక, అల్లం, కొబ్బరి తురుము వేసి వేయించాలి. మసాలా పొడి, టమాటా ప్యూరీ, కారం మిశ్రమం కలపాలి. రెండు నిమిషాల తరవాత కప్పు నీళ్లు, చక్కెర, ఉప్పు చేర్చాలి. పది నిమిషాల తరవాత అంతా దగ్గరవుతుంటే కోఫ్తాలను వేసి మంట తగ్గించాలి. రెండు నిమిషాల తరవాత స్టవ్ కట్టేసి కొత్తిమీర తరుగు వేస్తే కంచ్‌కోలర్ కోఫ్తా కర్రీ సిద్ధం.

### ఉల్లి రవ్వ భాక్రి

కావలసిన పదార్థాలు: రవ్వ - కప్పు, ఉల్లి - కప్పు, కొబ్బరి తురుము - రెండు స్పూన్లు, బెల్లం పొడి- స్పూను, కొత్తిమీర తరుగు - రెండు స్పూన్లు, పచ్చి మిర్చి - స్పూను, పసుపు - స్పూను, నెయ్యి, ఉప్పు, నీళ్లు - తగినంత. తయారుచేసే విధానం: కప్పున్నర నీళ్లలో రవ్వను అరగంట పాటు నానబెట్టి నీటిని వడగట్టాలి. ఈ రవ్వను ఓ గిన్నెలోకి తీసుకుని మిగతా దినుసులన్నీ కలపాలి. తగినంత ఉప్పు వేసుకోవాలి. టమాటా అంత రవ్వ మిశ్రమ ముద్దని తీసుకుని నెయ్యి రాసిన పెనంమీద తట్టాలి. కాస్త కాలాక ఇంకొంచెం నెయ్యి వేసి రెండు వైపులా

# గొల్లెడలు - గూళ్లాపిడలు



“...నిడ్డేనలు, గుడుములు, నప్పడంబులు, నిప్పట్లు, గొల్లెడలు, దోసియలు, సేవియ...” కాశీఖండంలో శ్రీనాథ మహాకవి “అనంత రంబా విశాలాక్షీ మహాదేవీ...” అంటూ మొదలుపెట్టి, వ్యాసుడికి, అతని శిష్యులకీ వడ్డించిన వంటకాల పట్టిక ఒకటి ఇచ్చాడు.

“...నిడ్డేనలు, గుడుములు, నప్పడంబులు,
నిప్పట్లు, గొల్లెడలు, దోసియలు, సేవియ...”

కాశీఖండంలో శ్రీనాథ మహాకవి “అనంత రంబా విశాలాక్షీ మహాదేవీ...” అంటూ మొదలుపెట్టి, వ్యాసుడికి, అతని శిష్యులకీ వడ్డించిన వంటకాల పట్టిక ఒకటి ఇచ్చాడు. ఇడ్డెనలు, కుడుములు, అప్పడాలు, నిప్పట్లు, గొల్లెడలు, దోసియలు, సేవియలు వీటిలో ఉన్నాయి. గొల్లెడలు అంటే ఏవి? గొల్లెన అంటే గూడు (డేరా) అని. ఇది లోపల తీపి పదార్థాన్ని ఉంచి పైన మూత పిండితో మూసి ఆవిరిమీద ఉడికించినవి గానీ, నూనెలో వేగించినవిగానీ గొల్లెడలు కావచ్చు. ఒక ఊహతో బయల్దేరి వెదికితే గానీ సమాధానం దొరకదు. భావప్రకాశ వైద్యగ్రంథంలో ‘సంయావ’ అనే వంటకం ఉంది. ఇది కూడా గూడు లోపల తీపి ద్రవ్యాన్ని ఉంచి మూతపిండిని మూసి నూనెలో వేగించే కజ్జికాయలాంటి వంటకం! “కృసర సంయావం పాయసాపూపమేవ చ” అని వ్యాస భాగవతంలో కృసర (పులగం, కట్టు పొంగలి), సంయావం, పాయసం, అపూపం వీటిని ప్రస్తావించాడు. భవిష్య పురాణం అంగారకుడికి నివేదనగా ‘సంయావ’ను పేర్కొంది. ఆప్టే సంస్కృత నిఘంటువు ‘సంయావం’ అంటే తీపి కలిపిన గోధుమ పిండి వంటకం అంది! “సంసూయతే మిశ్రీక్రియతే మిశ్రీక్రియతే గుడాదిభిః” అనే వ్యుత్పత్తి ననుసరించి, బెల్లం వగైరా ద్రవ్యాలను మిశ్రీక్రియ అంటే కలపటం ద్వారా సంసూయతే తయారైనది సంయావ అని దీని భావం. భావప్రకాశ వైద్యగ్రంథం ఈ సంయావ వండే విధానాన్ని ఇలా వివరించింది: గోధుమపిండిని నెయ్యి, పాలు పోసి మెత్తగా కలిపి పూరీలు వత్తి నేతిలో వేగించి చిన్న ముక్కలుగా విరిచి మెత్తగా అయ్యేలా మిక్సీ పట్టాలి. లేదా దంచాలి! బెల్లం, ఏలకులు, లవంగాలు, మిరియాలు, కొబ్బరికోరు, పచ్చ కర్పూరం, వీలైతే డ్రైనట్స్ వీటిని తగుపాళ్లలో తీసుకుని మెత్తగా దంచిన పొడిని ఈ పూరీల పొడిని చెరిసమానంగా కలిపి ఒక పక్కన ఉంచండి. ఇప్పుడు మళ్ళీ గోధుమపిండితో చిన్న పూరీ వత్తి దాని మధ్యలో ఈ పొడిని ఒక చెంచాడు పోసి కజ్జికాయలు వత్తే అచ్చులో మధ్యకు మడిచి సీలు చేసి నేతిలో వేగిస్తే అదే సంయావ. తెలుగువాళ్లు గరిజలు, గరిజకాయలు, కజ్జి కాయలు అని పిలుస్తున్నారిప్పుడు. ఈ కాశీ ఖండ పట్టికలో అప్పటికే ప్రాచుర్యంలో ఉన్న కజ్జికాయల్ని శ్రీనాథుడు వేరే ప్రస్తావించలేదు. 700 ఏళ్ల క్రితం శ్రీనాథుడి కాలంలో గొల్లెడలు అని ఉంటారు.

గొల్లెన వడలు గొల్లెడలు అయి ఉంటాయి!

“...లడ్వాలుఁ గోడబళ్లు గూడుపరిగలుఁ దేలు పరిగెలుఁ బూరీలు గూళ్లాపిడ లాదిగాఁ గల భక్ష్యంబులు” అంటూ హంసవింశతిలో అయ్యలరాజు నారాయణామాత్యుడు లడ్డూలు, కోడిబడులు (జొన్నవడలు), గూడు పరిగెలు, తేలు పరిగెలు, పూరీలు... ఇలా ఇచ్చిన పట్టికలో గూడుపరిగెలు గూళ్లాపిడలు అనే రెండు వంటకాల్ని ప్రస్తావించాడు. గూడు పరిగెలంటే ఆలూబజ్జీ మిరపకాయ బజ్జీలాగా తోపు పిండిలో ముంచి వేగించిన వంటకం కావచ్చు. గూళ్లాపిడలు కజ్జికాయ లాగా గూడు లోపల తీపినుంచి వేగించినవి అయి ఉంటాయని భావించవచ్చు. లోపల తీపి మాత్రమే కాదు కారపు ద్రవ్యాన్ని కూడా పెట్టి వండుకోవటం తరువాతి పరిణామం. సమోసాలు ఇలానే ఏర్పడ్డాయి. లోపల పెట్టే ద్రవ్యాలను బట్టి వాటి పేర్లు ఏర్పడి ఉండవచ్చు!

- డా. జి వి పూర్ణచందు, 94401 72642

కార్న్ వడ

కావలసిన పదార్థాలు: శనగపప్పు(నానబెట్టింది) -

అర కప్పు, స్వీట్ కార్న్-ఒకటిన్నర కప్పు, పచ్చి మిర్చి-రెండు, అల్లం ముక్కలు - అర స్పూను, ఎండు మిర్చి-రెండు, ఉల్లి ముక్కలు-అర కప్పు, జీలకర్ర- అర స్పూను, కరివేపాకు రెబ్బలు-స్పూను, కొత్తిమీర తరుగు-నాలుగు స్పూన్లు, శనగ పిండి-పావు కప్పు, ఉప్పు-తగినంత. తయారుచేసే విధానం: శనగపప్పు, స్వీట్ కార్న్ గింజలు (రెండు స్పూన్ల గింజలు వేరుగా పెట్టాలి), అల్లం, పచ్చి మిర్చి, ఎండు మిర్చి, కరివేపాకు మిక్సీలో వేసి ఓ మోస్తరుగా రుబ్బు కోవాలి. ఈ రుబ్బును ఓ గిన్నెలోకి వేసి, అందులో కరివేపాకు, జీలకర్ర, ఉప్పు, శనగపిండి, మిగిలిన కార్న్ గింజలు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ముద్దలుగా చేత్తో తీసుకుని వడలా వత్తుకుని నూనెలో వేయిస్తే కార్న్ వడలు సిద్ధం.

### కశ్మీరీ పనీర్ మసాలా

కావలసిన పదార్థాలు: పనీర్ - 350 గ్రాములు, టమాటా ప్యూరీ - మూడు స్పూన్లు, దాల్చిన చెక్క - ఒకటి, ఇంగువ - కాస్త, తేజ్ పత్తా - రెండు, యాలకులు - ఆరు, సోంపు - అర స్పూను, కశ్మీరీ కారం పొడి - అర స్పూను, సొంఠి - అర స్పూను, జీలకర్ర - అర స్పూను, పెరుగు - పావు కప్పు, గరం మసాలా పౌడర్ - పావు స్పూను, కొత్తిమీర రెబ్బలు - రెండు, కుంకుమ పువ్వు రేకులు - రెండు, ఉప్పు, నీళ్లు, నూనె - తగినంత. తయారుచేసే విధానం: ఓ ప్యాన్‌లో కాస్త నూనె వేసి పనీర్ ముక్కల్ని దోరగా వేయించాలి. ఈ ముక్కల్ని ఓ టిష్యూ పేపర్ మీద వేసి, నూనె అంతా పీల్చుకునేలా చేయాలి. గోరువెచ్చని నీళ్లలో పనీర్ ముక్కల్ని కాసేపు నానబెట్టాలి. ఓ మందమైన బాణలిలో కాస్త నూనె వేసి ఇంగువ, దాల్చిన చెక్క, తేజ్ పత్తా, యాలకులు వేయించాలి. అంతా చిటపటలాడుతుంటే జీలకర్ర వేయాలి. అర నిమిషం తరవాత మంట తగ్గించి టమాటా ప్యూరీ, ఉప్పు కలపాలి. మిర్చి, సొంఠి చేర్చాలి. తగినంత నీళ్లనిపోసి కాసేపు మరిగించాలి. కుంకుమ పువ్వును, పెరుగునూ కలపాలి. నాలుగు నిమిషాల తరవాత పనీర్ ముక్కల్నీ చేర్చాలి. రెండు నిమిషాల తరవాత గరం మసాలా, కొత్తిమీరనూ చల్లి పొయ్యి కట్టేస్తే కశ్మీరీ స్టయిల్ పనీర్ మసాలా నోరూరిస్తుంది.

# జాన్వీ జీవితంలో గొప్ప రివార్డు



: మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కలిసి కాలు కదిపిన నాటు నాటు సాంగ్ ఆస్కార్ కు ఎంపికై, ఆఖరికి అవార్డును కూడా దక్కించుకుంది. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్ఆర్ఆర్ లోని సాంగ్ ను గతేడాది ఆస్కార్ వరించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి ఇండియా తరపున తర్వాతి ఆస్కార్ అందుకోబోయే దెవరని అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఆస్కార్ లో ఎంట్రీ సాధించిన హెూమ్ బౌండ్ ఈ నేపథ్యంలో ఇప్పుడు జాన్వీ కపూర్ నటించిన హెూమ్ బౌండ్ సినిమా ఆస్కార్ లో ఎంట్రీ దక్కించుకోవడం విశేషంగా మారింది. నీరజ్ గైవాన్ దర్శకత్వంలో జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్, విశాల్ జత్వా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా 2026 అకాడమీ అవార్డుల్లో ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో అఫీషియల్ ఎంట్రీ దక్కించుకున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. దీంతో హెూమ్ బౌండ్ చిత్ర యూనిట్ ఎంతో ఎగ్జైట్ అవుతూ ఆ సక్సెస్ ను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంటూ తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు. నార్త్ ఇండియాలో ఓ చిన్న గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పోలీసులు కావాలని కలలు కంటారు. చిన్నప్పట్నుంచి కుల వివక్ష ఎదుర్కొన్న వాళ్లు పోలీసులైతే సమాజంలో ప్రతీ ఒక్కరి నుంచి గౌరవం దక్కుతుందని భావిస్తారు. పోలీస్ కావాలనే తమ టార్గెట్ ను చేరుకునే ప్రయత్నంలో వారిద్దరి జర్నీ, ఆ జర్నీలో వారి ఇబ్బందుల నేపథ్యంలో హెూమ్ బౌండ్ తెరకెక్కింది. తఇప్పటికే ఇంటర్నేషనల్ లెవెల్ లో గుర్తింపు ఈ సినిమాలో భాగమైనందుకు గర్వంగా ఉందని చెప్తున్న జాన్వీ కపూర్, హెూమ్ బౌండ్ ను తన జీవితానికి ఓ గొప్ప రివార్డుగా భావిస్తున్నట్టు తెలిపారు. కాగా ఇప్పటికే హెూమ్ బౌండ్ సినిమా ఇంటర్నేషనల్ గుర్తింపును పొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో ఈ సినిమా స్క్రీనింగ్ జరగ్గా, సినిమా చూశాక అందరూ దీనికి స్టాండింగ్ ఓవియేషన్ ఇచ్చారు. ఆ తర్వాత టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో పీపుల్స్ ఛాయిస్ విభాగంలో సెకండ్ రన్నరప్ అవార్డును కూడా దక్కించుకుంది హెూమ్ బౌండ్. ఆర్ఆర్ఆర్ తర్వాత ఆస్కార్ తెచ్చేది ఈ సినిమానేనా? బాలీవుడ్ ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ నిర్మించిన ఈ సినిమా ఆస్కార్ కు నామినేట్ అవడంతో తన టీమ్ ను అభినందిస్తూ, ఇదొక పెద్ద గౌరవం అని ఆయన తెలిపారు. అకాడమీ అవార్డుల ఫైనల్ షార్ట్ లిస్ట్ లో చోటు కోసం ఈ సినిమా 100కి పైగా ఇంటర్నేషనల్ సినిమాలతో పోటీ పడనుంది. మరి ఆర్ఆర్ఆర్ తర్వాత ఇండియాకు ఆస్కార్ ను తెచ్చే సినిమాగా హెూమ్ బౌండ్ నిలుస్తుందో లేదో చూడాలి.

అయితే కెరీర్ ను స్టార్ట్ చేసి పలు సినిమాలు చేసినప్పటికీ జాన్వీకి ఇప్పటివరకు గర్వంగా చెప్పుకోదగ్గ సినిమా ఒక్కటీ పడలేదు. అలాంటి టైమ్ లో అమ్మడు నటించిన హెూమ్ బౌండ్ ఆస్కార్ కు ఎంపికవడం జాన్వీకి, తన కెరీర్ కు మంచి బూస్టప్ ను ఇస్తుంది. ఈ జోష్ లో జాన్వీ తన కెరీర్లో మరిన్ని మంచి కథలను ఎంపిక చేసుకునే వీలుంది. కాగా హెూమ్ బౌండ్ సినిమా సెప్టెంబర్ 26న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఆస్కార్ ఎంట్రీ నేపథ్యంలో ఈ



# సీక్వెల్ కోసం 3 ఏళ్లు ఆగాల్సిందే..?

తేజ సజ్జ మిరాయ్ సినిమా అతని ఖాతాలో మరో సూపర్ హిట్ ఇచ్చింది. యూఎస్ లో 1 మిలియన్ తో పాటు ఓవరాల్ గా 100 కోట్ల క్లబ్ లో చేరి అదరగొట్టేసింది. కార్తీక్ ఘట్టమనేని డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాలో తేజ సజ్జతో పాటు మంచు మనోజ్ కూడా నటించాడు. సినిమాలో తిరిక నాయర్, శ్రీయ శరణ్ లు ఇంపార్టెంట్ రోల్ చేశారు. సినిమాపై ముందు నుంచి బజ్ ఉండగా రిలీజైన మొదటి షో నుంచి పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ఐతే మిరాయ్ సినిమాలో ప్రభాస్ వాయిస్ ఓవర్ సినిమాకు హ్యూజ్ క్రేజ్ తీసుకొచ్చింది. రానా ఎంట్రీ కూడా సర్ ప్రైజ్.. సినిమా చూసిన రెబల్ ఫ్యాన్స్ ప్రభాస్ వాయిస్ ని సూపర్ ఎంజాయ్ చేశారు. ఐతే సినిమా చివర్లో మిరాయ్ 2 కూడా అనౌన్స్ చేశారు. అందులో రానా విలన్ గా నటిస్తాడన్న క్లూ కూడా ఇచ్చాడు. రానా ఎంట్రీ కూడా సినిమాలో సర్ ప్రైజ్ చేసింది. ఐతే అది ఎండ్ టైటిల్స్ లో కాకుండా ఇంకాస్త ముందు పెడితే బాగుంటుందని అనుకుంటున్నారు. ఇదిలాఉంటే మిరాయ్ 2 సినిమా అనౌన్స్ అయితే చేశారు కానీ అది చేయడానికి చాలా టైం పట్టేలా ఉందనిపిస్తుంది. ఎందుకంటే మిరాయ్ సీక్వెల్ కన్నా ముందు కార్తీక్ ఆల్రెడీ కమిటైన మెగాస్టార్ చిరంజీవి, బాబీ సినిమా కెమెరా వర్క్ చేయాలి. మరోపక్క తేజ సజ్జ ఆల్రెడీ జాంబి రెడ్డి 2 చేయాల్సి ఉంది. జాంబి రెడ్డి ఫుల్ లెంగ్త్ రోల్ కాగా.. జై హనుమాన్ అదే హనుమాన్ 2 సినిమాలో కూడా తేజ సజ్జ కచ్చితంగా ఉంటాడనిపిస్తుంది. ఈ రెండు సీక్వెల్స్ తీసిన తర్వాతే తేజ సజ్జ మిరాయ్ 2 చేసే ఛాన్స్ ఉంది. 2028 లో మిరాయ్ 2.. ఐతే కార్తీకేయ రీసెంట్ ఇంటర్వ్యూలో మిరాయ్ 2 కి రెండేళ్లు టైం పడుతుందని అన్నాడు. అంటే సినిమా సెట్స్ మీదకు వెళ్లడానికే దాదాపు 2027 దాకా వెళ్తుందట. నెక్స్ట్ సినిమా రిలీజ్ మరో ఏడాది అవుతుంది. సో 2028 లో మిరాయ్ 2 ఉండే ఛాన్స్ ఉంది. మిరాయ్ 2 చూడాలంటే మరో 3 ఏళ్లు వెయిట్ చేయాల్సి ఉంటుంది. తప్పకుండా మిరాయ్ 2 మరో లెవెల్ లో ఉంటుందని అంటున్నాడు కార్తీక్ ఘట్టమనేని. తేజ సజ్జ కూడా ఈ 2, 3 ఏళ్లలో జాంబి రెడ్డి 2తో పాటు జై హనుమాన్ పూర్తి చేస్తాడు. మిరాయ్ 2 లో తేజ సజ్జ రానాతో ఢీ కొడుతున్నాడు. మిరాయ్ 1 లో మంచు మనోజ్ ని ఢీ కొట్టిన తేజ ఈసారి

# రామ్ చరణ్ కి జోడీగా సీతమ్మ!



రామ్ చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు తెరకెక్కిస్తోన్న - పెద్ది - షూటింగ్ ముగింపు దశకు చేరుకుంటోంది. చిత్రీకరణ మొదలైన నాటి నుంచి విరామం లేకుండానే పని చేయడంతో? షూటింగ్ ఎక్కడా డిస్టర్బ్ కాలేదు. ఈ నెలాఖరుకల్లా చిత్రీకరణ ఓ కొలిక్కి వచ్చేస్తుంది. అటుపై పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలో సుకుమార్ కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఆర్సీ 17 ప్రకటించడంతో కొన్ని రోజులుగా సుకుమార్ ఆ సినిమా పనుల్లోనే బిజీగా ఉన్నారు. తాజాగా ప్రీ ప్రొడక్షన్ పనులు వేగవంతం చేసారు. %-%పెద్ది - పూర్తయిన వెంటనే పట్టాలెక్కించా ల్సిన నేపథ్యంలో? పనులు వేగవంతం చేసారు. అయితే సినిమాలో హీరోయిన్ ఎవరు? అన్నది ఇంత వరకూ ఖరారు కాలేదు. టెక్నికల్ టీమ్ వరకూ సుకుమార్ పెద్దగా వర్కౌట్ చేయాల్సిన పనిలేదు. తన పాత టీమ్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. డీవోపీ, సంగీత దర్శకుల విషయంలో ఆయన కొత్తవాళ్లను వెతుక్కోవాల్సిన పనిలేదు. ఆ ఇద్దరు సుకుమార్ కు అన్ని రకాలుగా అండగా నిలబడతారు. అక్కడే సుకుమార్ కి సగం పని పూర్తయిపోతుంది. తాను నమ్మిన అసిసెంట్లు, అసోసియేట్ డైరెక్టర్లు అంతే కమిట్ మెంట్ తో పని చేస్తారు. ఆ రకంగా బ్యాకెండ్ లో సుకుమార్ కి మంచి టెక్నికల్ టీమ్ ఉంది.

మరి సినిమాలో హీరోయిన్ సంగతేంటి? అంటే బాలీవుడ్ నటి కృతిసనన్ ని ఎంపిక చేసే ఆలోచన లో ఉన్నట్లు లీకైంది. సుకుమార్ రాసిన హీరోయిన్ పాత్రకు కృతి సనన్ పర్ఫెక్ట్ గా సూటువుతందని..తన మీద మళ్లీ ప్రత్యేకంగా ఫోటో షూట్..ఆడిషన్ లాంటివి చేయకుండానే ఎంపిక చేయొచ్చని భావిస్తున్నారట. గతంలో సుకుమార్ తో పని చేసి అనుభవం కృతి సనన్ కి ఉంది. మహేష్ హీరోగా నటించిన %-%వన్%-% సినిమాలో ఈ భామనే హీరోయిన్. టాలీవుడ్ లో డెబ్యూ చిత్రమిదే. కానీ సినిమా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. అటుపై కృతి మరో రెండు..మూడు తెలుగు సినిమాలు చేసి బాలీవుడ్ కి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మళ్లీ తెలుగు సినిమా వైపు చూడలేదు. మళ్లీ సుకుమార్ కారణంగానే టాలీవుడ్ లో సెకెండ్ ఛాన్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. మరి తుదిగా ఆ ఛాన్స్ తనకే సొంతమవుతుందా? లేదా? అన్నది చూడాలి. ప్రస్తుతం కృతి సనన్ బాలీవుడ్ లో బిజీగా ఉంది. వరుసగా స్టార్ హీరోల చిత్రాల్లో నటిస్తోంది.

# దసరా కల్లా నేషనల్ క్రష్ ఎంట్రీ పై క్లారిటీ!



బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ %-%క్రిష్%-% నుంచి 'క్రిష్ 4'కి సన్నాహకాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈసారి హృతిక్ రోషన్ నటించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా తీసుకుంటున్నారు. దీంతో సినిమా మరింత ప్రతిష్టాత్మ కంగా మారింది. హృతిక్ మేకింగ్..టేకింగ్ ఎలా ఉంటుంది? అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి ప్రతీ పని హృతిక్ దగ్గరుండి చూసుకుంటున్నాడు. స్క్రిప్ట్ సిద్దం చేయడం దగ్గర నుంచి ఇతర ప్రీ ప్రొడక్షన్ పనులన్ని తన కను సన్నలోనే జరుగుతున్నాయి. ఈ విషయంలో డాడ్ రాకేష్ రోషన్ నిర్మాతగా వెనుకుండి తాను తనయుడికి అందించాల్సినవన్నీ అందించడమే. పోటీగా కార్పోరేట్ సంస్థలు: తనయుడు కెప్టెన్ అవుతోన్న చిత్రం కావడంతో తండ్రి కూడా అంతే సంతోషంగా ఉన్నారు. తనయుడిగా నటనకే పరిమితమవ్వకుండా డాడీ బాధ్యతలు కూడా హృతిక్ తీసుకోవడంతో తనయుడిని చూసి మురిసిపోతున్నారు. ఈ నేపథ్యంలో సినిమా గురించి ప్రపంచమే గొప్ప గా మాట్లాడుకునే స్థాయిలో ఉండాలంటే? తన నిర్మాణ సంస్థతో పాటు భారీ నిర్మాణ సంస్థలు కూడా సినిమాలో భాగం అవ్వొచ్చు అంటూ పబ్లిక్ గా ప్రకటించారు. దీంతో పెద్ద పెద్ద కార్పోరేట్ సంస్థలు కూడా రంగంలోకి దిగుతున్నాయి. బాలీవుడ్ సంస్థలకు పోటీగా పెట్టుబడి పెట్టడానికి రెడీ అవుతున్నాయి. సానుకూలంగా రష్మిక స్పందన: ఈ సినిమాలో హీరోయిన్ గా నేషనల్ క్రష్ రష్మికా మందన్నా నటిస్తోందని ప్రచారం కొన్ని రోజులుగా వైరల్ అవుతోన్న నసంగతి తెలిసిందే. బాలీవుడ్ లో ఎంతో మంది హీరోయిన్లు ఉన్నా రష్మికని ఏరికోరి మరీ తీసుకుంటు న్నారే ప్రచారం తారాస్థాయికి... పాన్ ఇండియాలో అమ్మడికి ఉన్న ఇమేజ్ కారణంగానే ఇంత పెద్ద ప్రాజెక్ట్ లో భాతగమవుతుందనే వార్త దావానాలా వ్యాపించింది. మరి ఇందులో నిజమెంత? అంటే ఇప్పటికే నిర్మాణ వర్గాలు ఆమెని అప్రోచ్ అవ్వడం...సానుకూలంగా స్పందించడం జరిగిందని వస్తోంది అన్నది వాస్తవమే. %రూశ్రీంశీ =ఝుస - రా+%తో హెల్త్ అప్సెట్ అయ్యేలా ఉందే: యువ హీరో రెండు భాషల్లోనూ బిజీ బిజీగా: అయితే క్లారిటీ రావడానికి మాత్రం మరికొన్ని రోజులు పడుతుందని తెలిసింది. నిర్వాహకులు ఆమెను అప్రోచ్ అవ్వగా జాయిన్ అవుతాననే ప్రామిస్ చేసిందట. కానీ అదే విషయాన్ని క్లియర్ గా ఇప్పుడే చెప్పలేనని దసరా కల్లా తాజా సినిమాలపై ఓ క్లారిటీ వస్తుందని..అనంతరం అగ్రిమెంట్ చేసుకుందామని సూచించిదట. ప్రస్తుతం రష్మిక తెలుగు సినిమాలతో పాటు హిందీ సినిమాల్లోనూ నటిస్తూ బిజీగా ఉంది. వీటిలో ఓ లేడీ ఓరియేంటెడ్ చిత్రం కూడా ఉన్న సంగతి తెలిసిందే.

# ట్రాన్స్పరెంట్ దుస్తుల్లో హీట్ పెంచుతున్న దిశాపటానీ!



ఒకప్పుడు హీరోయిన్స్ ఫోటోలకు ఫోజులివ్వమంటే నిండుగా చీర కట్టుకొని లేదా లంగా వోణీలు, చుడిదార్ వేసుకొని కనిపించేవారు. కాస్త జనరేషన్ ముందుకు వచ్చాక హీరోయిన్లు కొన్ని వెస్టన్ డ్రెస్ లలో కనిపించేవారు. కానీ ఆ డ్రెస్సులు మోకాళ్ళ కిందికే ఉండేవి. ఇక నడుము అందాలను చూపించి చూపించినట్లుగా ఫోటోలకు ఫోజులిచ్చి అప్పటి హీరోయిన్స్ మెస్మరైజ్ చేసేవాళ్లు. కానీ ఇప్పటి హీరోయిన్లు మాత్రం అంతా ఓపెన్ గానే అందాలు పూర్తిగా కనిపించేలా డ్రెస్సులు వేసుకోవడం అనేది ఫ్యాషన్ గా మారిపోయింది. ఒక హీరోయిన్ ని చూసి మరొక హీరోయిన్ చాలా వెరైటీగా డ్రెస్ లను ఎంచు కుంటున్నారు. కొంతమంది హీరోయిన్లు అయితే ఒక అడుగు ముందుకేసి శరీరం మొత్తం కనిపించేలా ఫోటోలు కూడా తీయించుకుంటున్నారు. ఇక ఎక్కువ శాతం మంది హీరోయిన్లు మాత్రం ప్రైవేట్ పార్ట్స్ బయటికి కనిపించేలా డ్రెస్సులు ధరిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ కూడా లో దుస్తులు కనిపించేలా వేసుకున్న ట్రాన్స్పరెంట్ బ్లూ కలర్ డ్రెస్ కి సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట్లో చక్కర్లు కొట్టడంతో పాటు ఆమె అభిమానులను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి.. దిశా పటానీ తాజా లుక్ కి ఎంతోమంది ఆకర్షితులవుతున్నారు. మృదువైన నీలిరంగు క్రాప్ టాప్ ధరించి దానికి సరిపోయే రాఫ్ఫ్ స్కర్ట్ వేసుకుంది.. అలాగే ఆమె కర్లీ హెయిర్ తో ఆ డ్రెస్ కి ఆమె ఫేస్ కి మరింత అందం వచ్చింది.. ఈ డ్రెస్ లో చాలా దిశాపటాని హాట్ గా కనిపిస్తోంది. ముఖ్యంగా దిశాపటాని లోదుస్తులు హైలెట్ అయ్యేలా ఈ డ్రెస్ ఉండడం గమనార్హం.. లోదుస్తులు బయటికి కనిపించినా కూడా చాలా ధైర్యంగా ఫోటోలకు ఫోజులిచ్చింది. అలా ఫ్యాషన్ కి అతీతంగా దిశా పటాని రకరకాల డ్రెస్సులు వేసుకుంటూ ఫోటోలకు స్టిల్స్ ఇస్తూ ఉంటుంది.. అలా ఎప్పటికప్పుడు అభిమానులతో టచ్ లో ఉంటూ ఫోటోలతో అభిమానుల మనసు దోచుకుంటుంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం హెూలీగార్డ్స్ సాగా-ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్ అనే ఇంగ్లీష్ సినిమాలో చేస్తోంది. ఈ సినిమా ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే హిందీలో వెల్కమ్ టు ది జంగిల్ అనే మల్టీస్టారర్ మూవీలో కూడా నటిస్తోంది. అలా బాలీవుడ్ నుండి హాలీవుడ్ వరకు వెళ్లిన ఈ ముద్దుగుమ్మ సౌత్ ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. ఎందుకంటే దిశా పటాని సినిమాల్లోకి వచ్చింది తెలుగు ఇండస్ట్రీ ద్వారానే. మెగా హీరో వరుణ్ తేజ్ నటించిన లోఫర్ మూవీ ద్వారా ఇండస్ట్రీలోకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత బాలీవుడ్లో సినిమాలు చేసి గత ఏడాది వచ్చిన కల్కి 2898 %ూణ% మూవీలో కూడా నటించింది.







# అబ్బా.. అతిలోక సుందరిని తలపిస్తున్న నభా నటేష్..

సినిమా ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ సమయంలో మంచి పేరు తెచ్చుకున్న హీరోయిన్లలో నభా నటేష్ కూడా ఒకరు.. ఈ హీరోయిన్ తన అమాయకపు చూపులతో.. అందాలతో సినిమాల్లోనే కాదు సోషల్ మీడియాలో కూడా ఫాలోవర్స్ ని పెంచుకుంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా షేర్ చేసిన ఫోటోస్ చూస్తే కుర్రకారు మతి పోవాల్సిందే. పసుపు రంగు చీరలో ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోస్ సోషల్ మీడియాలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారాయి. ఈ ఫోటోస్ షేర్ చేసిన కొద్ది క్షణాల్లోనే వేలల్లో లైకులు, వందల్లో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. అలా తాజాగా అతిలోక సుందరిని తలపిస్తూ..

పసుపు రంగు చీరలో ఉన్న నభా నటేష్ ఫోటోస్ అందరినీ ఆకట్టు కుంటు న్నాయి.. ఎల్లో కలర్ నెట్టెడ్ ఫ్యాబ్రిక్ తో ఉన్న శారీని కట్టుకున్న నభా నటేష్.. స్లీవ్ లెస్ బ్లౌజ్ లో ఉబికి వస్తున్న పరువాలతో కుర్రకారుకి మత్తెక్కిస్తోంది.. ఈ ఫోటోలు చూసిన చాలామంది నెటిజన్లు, ఆమె అభిమానులు ఫైర్ ఎమోజిని షేర్ చేస్తూ చాలా హాట్ గా ఉన్నావంటూ కామెంట్లు పెడుతున్నారు. మరి కొంతమందేమో నువ్వు ఎలా రెడీ అయినా సరే బుట్ట బొమ్మవే.. రోజురోజుకీ నీపై అభిమానం పెరిగిపోతుందని, ఇంకొంతమందేమో ఈ చీరకట్టులో నిన్ను చూస్తే చెమటలు పట్టేస్తున్నాయ్ అంటూ ఇలా ఎవరి స్టైల్ లో వాళ్లు కామెంట్స్ పెడుతున్నారు.. నభా నటేష్ కెరియర్ విషయానికి వస్తే.. 2015లో కన్నడ ఇండస్ట్రీ ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి నభా నటేష్ కన్నడలో రెండు మూడు సినిమాలు చేసి, ఆ తర్వాత సుధీర్ బాబు హీరోగా చేసిన 'నన్ను దోచుకుందువటే' అనే సినిమాతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత రవిబాబు డైరెక్షన్లో వచ్చిన ఫాంటసీ కామెడీ 'అదుగో' మూవీలో కూడా నటించింది. కానీ ఈ రెండు సినిమాలు నభా నటేష్ కి కలిసి రాలేదు.

ఇక పూరీ జగన్నాథ్ డైరెక్షన్లో రామ్ పోతినేని హీరోగా వచ్చిన ఇస్మార్ట్ శంకర్ మూవీతో నభా నటేష్ దశ తిరిగిపోయింది. ఈ సినిమా హిట్ తో నభా నటేష్ కి వరుస ఆఫర్స్ వచ్చాయి. అలా డిస్కో రాజా, సోలో బతికే సో బెటర్ వంటి సినిమాలు చేసింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ నిఖిల్ హీరోగా చేస్తున్న పాన్ ఇండియా మూవీ 'స్వయంభు' లో హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే అభిషేక్ నామా డైరెక్షన్లో వస్తున్న 'నాగబంధం'

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt) APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur. ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell: 6303427710